ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

శుక్రవారం 18 అక్టోబరు 2024



చౌడువాడలో విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రం వద్ద పాల క్యాన్లతో నిరసన తెలుపుతున్న రైతులు

ముసురు!

- రాంబిల్లి మండలంలో అత్యధికంగా 45.2 మి.మీ.ల వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన కలెక్టర్
- ఈదురు గాలులు వీయకపోవడంతో ఊపిరిపీల్చుకున్న రైతులు

వాయుగుండం ప్రభావంతో మోస్తరు వర్షాలు



గొలుగొండ మండలం జోగంపేటలో వర్షం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం... వాయుగుండంగా బలపడడంతో గురువారం జిల్లా అంతటా మోస్తరు వర్షాలు కురిశాయి. వాయుగుండం తమిళనాడు, ఏపీ సరిహద్దులో చెన్నై- తడ మధ్య తీరదాటినట్టు వాతావరణ శాఖ వెల్లడించడంతో తుఫాన్ ముప్పు తప్పిందని అధికార యంత్రాంగంతోపాటు అన్నదాతలు ఊపిరిపీల్చుకున్నారు. అయితే మరో 24 గంటల వరకు వర్షాలు కురిసే అవకాశం వుందన్న సమాచారంతో రెవెన్యూ అధికారులు మండల కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ కొనసాగిస్తున్నారు.

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లాలో గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా గురువారం ఉదయం నుంచి ముసురు వాతావరణం నెలకొంది. సముద్ర తీర మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మిగిలినచోట్ల అడపాదడపా జల్లులు పడుతున్నాయి. రహదారుల్లోని గుంతల్లో నీరు చేరి రోడ్లు బురదగా మారాయి. ముసురు వాతావరణం కారణంగా సాధారణ జనజీవనానికి అంతరాయం కలిగింది.

అనకాపల్లి పట్టణంలో గురువారం తెల్లవారు జాము నుంచి దఫదఫాలుగా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు జనం ఇబ్బంది పడ్డారు. నర్సీపట్నంలో గురువారం ఉదయం ఏడు గంటల నుంచి పది గంటలు వరకు తెరిపివ్వకుండా వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఆర్టీసీ కాంప్లెక్స్, శివపురం, బ్యాంక్ కాలనీ, ప్రశాంతి నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో వర్షం నీరు మెయిన్ రోడ్డులో నిలిచి పోయి వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

అచ్యుతాపురం మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు పలుమార్లు భారీ వర్షం కురిసింది. సముద్ర తీరగ్రామాల్లో ఈదురు గాలులు వీచడంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. విద్యుత్ సిబ్బంది గురువారం ఉద యం రంగంలోకి దిగి కూలిన స్తంభాల స్థానంలో కొత్తవాటిని అమర్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

12.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం

కాగా జిల్లాలో గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 12.4 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. రాంబిల్లి మండలంలో అత్యధికంగా 45.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మండలాల వారీగా వర్షంపాతం వివరాలను పరిశీలిస్తే.. అచ్యుతాపురంలో 44.2 మిల్లీ మీటర్లు, పరవాడలో 32.2, నక్కపల్లిలో 27.4, ఎస్.రాయవరంలో 20.2, మునగపాకలో 17.8, పాయకరావుపేటలో 17.4, సబ్బవరంలో 10, ఎలమంచిలిలో 9.2, నర్సీపట్నంలో 9, రోలుగుంటలో 8.8, కశింకోటలో 8.4, కోటవురట్లలో 6.4, గొలుగొండలో 5.4, అనకాపల్లిలో 5.4, కె.కోటపాడులో 5, రావికమతంలో 4.6, నాతవరంలో 4.4, మునగపాకలో 4.4, చీడికాడలో 4, చోడవరంలో 3.8, మాడుగులలో 2.6, దేవరాపల్లిలో 1.2, బుచ్చెయ్యపేట మండలంలో 1.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

అధికారయంత్రాంగం అప్రమత్తం

జిల్లాలో రానున్న 24 గంటల్లో పలు చోట్ల పిడుగులు, ఉరుములతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. మండల రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉండాలనికలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను (ఫోన్ నంబరు 89024-222888) కొనసాగించాలని నిర్ణయించారు.



ఎలమంచిలి మండలం జంపపాలెంలో వర్షం నీటితో చెరువును తలపిస్తున్న ఉన్నత పాఠశాల ఆవరణ



నర్సీపట్నంలో ముసురు వాతావరణం

పాల సేకరణ ధర తగ్గింపుపై రైతులు ఆగ్రహం

ఆవు పాలు లీటరుకు రూ.4 వరకు కోత

- విశాఖ డెయిరీ తీరుపై మండిపాటు
- చైర్మన్‌కు వ్యతిరేకంగా నినాదాలు

కె.కోటపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ యాజమాన్యం పాల సేకరణ ధరను అమాంతం తగ్గించడంపై పాడి రైతులు భగ్గుమన్నారు. మండలంలోని చౌడువాడ పాల సేకరణ కేంద్రం వద్ద గురువారం ఉదయం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, డెయిరీ యాజమాన్యం సభ్య రైతులకు సరఫరా చేస్తున్న పశుదాణా ధరలను తరచూ పెంచుతున్నదని ఆరోపించారు. పాల సేకరణ ధరలు పెంచకపోగా, మరింత తగ్గించిందని మండిపడ్డారు. పశుపోషణ వ్యయం విపరీతంగా పెరిగినప్పటికీ విశాఖ డెయిరీ యాజమాన్యం పాలసేకరణ ధరలు పెంచకపోవడం శోచనీయమని అన్నారు. వ్యవసాయం లాభసాటిగా లేకపోవడంతో పంటల సాగుకు స్వస్తి చెప్పి, పాడి పశువులను పోషించుకుంటూ, పాల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నామని చెప్పారు. ఇటువంటి తరుణంలో ఆవు పాల సేకరణ ధరలను గణనీయంగా తగ్గించడం ఏమిటని ప్రశ్నించారు. వెన్న శాతాన్నిబట్టి లీటరుకు రూ.33.93 నుంచి రూ.44.05 వరకు చెల్లించే వారని, ఇప్పుడు గరిష్ఠంగా రూ.40.86 మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. విశాఖ డెయిరీ యాజమాన్యం రెండేళ్ల నుంచి బోనస్ కూడా ఇవ్వడంలేదన్నారు. ఈ సందర్భంగా డెయిరీ చైర్మన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒక దశలో డెయిరీ చైర్మన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాల సంఘం అధ్యక్షుడు కుమార వెంకటరమణ, డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్‌లు పాల కేంద్రానికి చేరుకున్నారు. ఆవు పాల సేకరణ ధరపై యాజమాన్యంతో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించారు.

అధిక ధరకు మద్యంపై ఆగ్రహం

- షాపు తెరవద్దంటూ మందుబాబులు గొడవ
- రెండో రోజూ మద్యం దుకాణం మూసివేత

మాకవరపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గరిష్ఠ చిల్లర ధరకన్నా ఎక్కువ రేటుకు మద్యం అమ్ముతుండడంతో మందు బాబులు గురువారం ఉదయం మాకవరపాలెంలో మద్యం దుకాణం వద్ద

... మిగతా 8వ పేజీలో



మద్యం దుకాణం నిర్వాహకులతో మందుబాబులు వాగ్వాదం

కుంటుపడిన రెవెన్యూ పాలన

మండల కార్యాలయంలో ఆరు పోస్టులు ఖాళీ

- 18 మంది వీఆర్వోలకుగాను ఉన్నది తొమ్మిది మందే!
- బదిలీలతో ఖాళీ అయిన స్థానాలను భర్తీ చేయని అధికారులు
- రెవెన్యూ పనుల్లో జాప్యం.. ప్రజల ఇబ్బందులు

నాతవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):

తహసీల్దార్ కార్యాలయంలో పాలన కుంటుపడింది. అధికారులు, సిబ్బంది కలిపి పది మందికిగాను ప్రస్తుతం నలుగురే వున్నారు. ఇక క్షేత్రస్థాయిలో 18 మంది వీఆర్వోలు వుండాలి. వీటిలో తొమ్మిది పోస్టులు ఖాళీగా వున్నాయి. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడి నుంచి స్థానచలం అయిన ఉద్యోగులస్థానంలో కొత్తగా ఎవరినీ నియమించలేదు. దీంతో రెవెన్యూ శాఖ పరమైన పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



నాతవరం తహసీల్దార్ కార్యాలయం

నాతవరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ముగ్గురు అటెండర్లు, ఒక టైపిస్టు, ఒక కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు వున్నాయి. మూడు వారాల క్రితం ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు అటెండర్లు, ఒక టైపిస్టు ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు. వీరిస్థానంలో ఉన్నతాధికారులు ఎవరినీ నియమించలేదు. ప్రస్తుతం తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్ మాత్రమే వున్నారు. క్షేత్రస్థాయిలో 18 మంది గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వోలు) వుండాలి. కానీ ప్రస్తుతం తొమ్మిది పోస్టులు ఖాళీగా వున్నాయి. పట్టాదారు పాస్‌పుస్తకాలు, కుల, ఆదాయ ధ్రువపత్రాలు పొందాలంటే తొలుత వీఆర్వోలు సంతకం చేయాలి. కానీ వీఆర్వో పోస్టులు సగం ఖాళీగా వుండడంతో ధ్రువ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళితే.. వీఆర్వో సంతకం వుండాలని సిబ్బంది చెబుతున్నారు. తమ పంచాయతీల్లో వీఆర్వోలే లేకపోతే ఎవరిచేత సంతకాలు చేయిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదనతో ప్రశ్నిస్తున్నారు. అలాగే పట్టాదారు పాసుపుస్తకాలు కూడా వీఆర్వోలు సంతకం ఉంటేనే ముందుకు కదులుతాయి. ఉన్నతాధికారులు స్పందించి మండల రెవెన్యూ శాఖలో ఖాళీ పోస్టుల్లో ఉద్యోగులను నియమించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఖాళీగా ఉన్న ఆర్ఐ కుర్చీ

కాగా ఎంపీడీవో పోస్టు కూడా ఖాళీగా వుంది. నర్సీపట్నం ఎంపీడీవో ఉషశ్రీని ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించారు. ఆమె వారంలో ఒక రోజు నాతవరం వస్తారని చెప్పారు. కానీ కచ్చితంగా ఏ రోజు వస్తారో వెల్లడించకపోవడంతో వివిధ పనుల నిమిత్తం పలుమార్లు రావాల్సి వస్తున్నదని ప్రజలు వాపోతున్నారు.

డబుల్ రిజిస్ట్రేషన్‌తో తిరకాసు

వివాదంలో ఇ-మర్రిపాలెం లేఅవుట్

- 2012లో భూములు కొనుగోలు చేశామంటున్న ఒక వర్గం
- మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ అనుచరులు కబ్జా చేస్తున్నారని ఆరోపణ
- పరవాడ పోలీసులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు
- తాము 2007లోనే భూములను రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని మరో వర్గం వాదన



ఇ- మర్రిపాలెంలో లేఅవుట్ స్థలం

లంకెలపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):

పరవాడ మండలం ఇ-మర్రిపాలెం రెవెన్యూ పరిధిలో ఒక ప్రైవేటు లేఅవుట్ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. తాము 2012లో ఈ భూములను కొనుగోలు చేసి లేఅవుట్ వేసుకున్నామని, ఇటీవల టీడీపీ నేత గండి బాబ్జీ అనుచరులు అక్రమణకు పాల్పడ్డారని ఆరోపిస్తూ కొంత మంది వ్యక్తులు అధికారులకు ఫిర్యాదులు చేసి, ఆందోళనలు చేస్తున్నారు. అయితే ఈ భూమిని తాము 2007లోనే కొనుగోలు చేశామని, రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నామని, గండి బాబ్జీకి ఈ వ్యవహారంతో ఎటువంటి సంబంధం లేదని మరోవర్గం వారు అంటున్నారు. దీనిపై పోటాపోటీగా ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. ఈ లేఅవుట్‌లోని భూమి ఎవరికి చెందుతుందో తేల్చాల్సిన బాధ్యత అధికారులపైనే వుంది. ఇందుకు సంబంధించి ఇరువర్గాలు వెల్లడించిన వివరాలిలా వున్నాయి.

పరవాడ మండలం ఇ-మర్రిపాలెం గ్రామానికి చెందిన పిండి జగన్నాథం అనే వ్యక్తికి సర్వే నంబర్లు 15, 16/1లో 11.4 ఎకరాల భూములు ఉన్నాయి. వీటిలో కొంత జిరాయితీ, కాగా మరికొంత ఇనాం భూమి వుంది. ఇతని కుమారుడు పిండి శ్రీనివాస రావు 2012లో రెండు దఫాలుగా ఐదు ఎకరాల భూమిని స్టీల్ ప్లాంట్ ఉద్యోగి సాంబశివ రావు, మరో 16 మంది వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. మరో నాలుగు ఎకరాలను దుల్ల రామునాయుడుకు విక్రయించారు. సాంబశివరావు బృందం తాము కొనుగోలు చేసిన భూమికి నాలా పన్ను చెల్లించి, ఇళ్ల స్థలాల లేఅవుట్ వేశారు. తరువాత 2015 వరకు దఫదఫాలుగా 80 మందికి ఇళ్ల స్థలాలను విక్రయించారు. ప్లాట్ల సరిహద్దులుగా భూమికి అడుగు ఎత్తులో పునాది గోడలు నిర్మించుకున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ అనుచరులు దుల్ల రామునాయుడు, దుల్ల కృష్ణ, దివాకర్ నాయుడులు దౌర్జన్యంగా లేఅవుట్‌లోకి ప్రవేశించి, పునాదులను ధ్వంసం చేశారని వీరు ఆరోపిస్తున్నారు. పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ ఈ నెల 14వ తేదీన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇదిలావుండగా పిండి జగన్నాథం రెండో కుమారుడైన వెంకటరావు, కుమార్తెలు ఎడ్ల వెంకటలక్ష్మీ, దుల్ల వెంకటరత్నం, రామాల చిన్నమ్మల వద్ద 7.62 ఎకరాల భూమిని కొనుగోలు

... మిగతా 8వ పేజీలో



లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, తదితరులు

మంత్రి నారా లోకేశ్ విశాఖ రాక

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ గురువారం రాత్రి నగరానికి చేరుకున్నారు. రాజస్థాన్‌లోని ఉదయపూర్ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ వచ్చిన ఆయనకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు పి.గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ, మాజీ ఎమ్మెల్సీ బుద్దా నాగజగదీశ్వరరావు, ఉమ్మడి జిల్లా నాయకులు దాడి రత్నాకర్, మహ్మద్ నజీర్, సీతంరాజు సుధాకర్, కిడారి శ్రావణ్‌కుమార్, తదితరులు స్వాగతం పలికారు. లోకేశ్ విమానాశ్రయం నుంచి పార్టీ కార్యాలయానికి చేరుకుని బస చేశారు. ఆయన శుక్రవారం కోర్టుకు హాజరవుతారు. శనివారం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ఆదివాసీలకు తప్పని డోలీ మోతలు

పిత్రిగెడ్డలో గిరిజన బాలింతకు తీవ్రఅస్వస్థత

- డోలీ కట్టి.. 6 కి.మీ.లు మోసుకుంటూ ఆస్పత్రికి తరలింపు

రోలుగుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):

దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ కొండలపై నివసిస్తున్న ఆదివాసీలకు డోలిమోతలు తప్పడం లేదు. కనీస రహదారి సదుపాయం లేకపోవడంతో తీవ్ర అస్వస్థతకు గురైన రోగులను, నిండు గర్భిణులు, బాలింతలను ఆస్పత్రులకు తీసుకెళ్లడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది. తాజాగా మండలంలోని అర్ల పంచాయతీ శివారు పిత్రిగెడ్డ గ్రామానికి చెందిన పచ్చి బాలింత కొర్రా దేవిని డోలీ కట్టుకుని పీహెచ్‌సీకి మోసుకెళ్లారు. ఈమెకు బుధవారం రాత్రి పురుటి నొప్పులు రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లలేక ఇంట్లోనే పురుడుపోశారు. బిడ్డ పుట్టిన అనంతరం అస్వస్థతకు గురవడంతో గురువారం తెల్లవారుజామున భర్త కొర్రా రమేశ్, కుటుంబ సభ్యులు కొర్రా రాజు, తదితరులు డోలి కట్టి పిత్రిగెడ్డ నుంచి అర్ల వరకు ఆరు కిలోమీటర్లు మోసుకువచ్చారు. ఇక్కడి నుంచి 108కు ఫోన్ చేయగా అంబులెన్స్ అందుబాటులో లేదని సమాచారం వచ్చింది. దీంతో ఆటో రప్పించుకుని బుచ్చెంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు.



డోలీపై బాలింతను ఆస్పత్రికి మోసుకెళుతున్న కుటుంబ సభ్యులు

పరిశ్రమలలో సమస్యలను పరిష్కరించాలి : సుందరపు


పరిశ్రమల శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక (తుమ్మపాల), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎలమంచిలి నియోజకవర్గ పరిధిలోని పరిశ్రమలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం పరిశ్రమల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి సమస్యలను వివరించి, పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడుతూ అచ్యుతాపురం ప్రాంతంలో గల పరిశ్రమలలో పలు సమస్యలు నెలకొన్నాయన్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి స్వల్ప వ్యవధిలోనే ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు ఉన్నారు.

గొట్టివాడ, కైలాసపట్నం ఇసుక రీచ్‌లు గుర్తింపు


గొట్టివాడలో ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

కోటవురట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు ఇసుక రీచ్‌లను గుర్తించినట్టు తహసీల్దార్ తిరుమలబాబు, ఎంపీడీవో కాశీవిశ్వనాథం తెలిపారు. గురువారం మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ మండలంలోని సర్పా, వరాహ నదుల్లో గొట్టివాడ, కైలాసపట్నం గ్రామాల వద్ద ఇసుక నిల్వలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఈ రెండు ఇసుక రీచ్‌లను ఎంపిక చేసి నివేదికను పంపించాలని ఆమె ఆదేశించారు. ఈ రీచ్‌లనుంచి సేకరించిన ఇసుకను కేవలం అభివృద్ధి పనులకు మాత్రమే వినియోగించుకోవాలన్నారు. ఇసుక తవ్వకాలు సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో జరగాలన్నారు. అవసరాన్ని బట్టి సచివాలయ సిబ్బంది నైట్ డ్యూటీలు చేయాల్సి ఉంటుందన్నారు. ఇసుక రీచ్‌ల్లో ఇసుక పక్కదారి పడితే సచివాలయ సిబ్బందిపై చర్యలు ఉంటాయన్నారు.

వసతి గృహాన్ని పరిశీలించిన న్యాయమూర్తి


హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పి. విజయ

ఎలమంచిలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల వసతిగృహాన్ని గురువారం సాయంత్రం ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి. విజయ సందర్శించారు. తొలుత హాస్టల్ విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ విద్యార్థులతో మాట్లాడి వసతి గృహంలో ర్యాగింగ్ వంటివి ఎవరైనా చేస్తున్నారా అని అడిగారు. హాస్టల్‌లోని స్టోర్ రూమ్‌లోని పప్పులు, ఆయిల్ తదితర వంట సామగ్రిని పరిశీలించారు. కిచెన్‌లో అప్పటికే వండిన ఆహారం, కూర, పెరుగు వంటి వాటిని పరిశీలించి, వంట మనిషికి పలు వివరాలు అడిగారు. విద్యార్థులు నిద్రపోయే గదులను పరిశీలించి, పరిశుభ్రత మరింత పాటించాలని సూచించారు. వార్డెన్ రాజ్‌కుమార్‌ను వసతి గృహ నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని మరో రెండు వసతి గృహాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు హరి శంకరరావు, పీవీ.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

అభిజిత్ కర్మాగారాన్ని వెంటనే తెరవాలి

- తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా


డీటీ శ్యామ్‌కుమార్‌కి వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చట్టవిరుద్ధంగా మూసివేసిన అభిజిత్ కంపెనీని వెంటనే తెరిపించాలని కోరుతూ కార్మికులు, ప్రజాసంఘాలు గురువారం అచ్యుతాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెబుతున్న కూటమి ప్రభుత్వం వెయ్యి మంది ఉద్యోగులను రోడ్డున పడేసిందని విమర్శించారు. కర్మాగారం తెరిచిన వరకు 15 రోజుల వేతనం ఇస్తామని యాజమాన్యం ప్రకటించటం హాస్యాస్పదమన్నారు. నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్నా ఇటు అధికారులు గాని, అటు పాలకులు గాని పట్టించుకోకపోవడం విచారించదగ్గ విషయమన్నారు. అనంతరం డీటీ శ్యామ్‌కుమార్‌కి వినతిపత్రాన్ని అందజేశారు. ఆందోళనలో సోమునాయుడు, కార్మికులు పాల్గొన్నారు.

కారిడార్ రైతుల సమస్యలపై వినతులు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కారిడార్ నిర్వాసిత రైతులు

నక్కపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలపర్ర, డీఎల్ పురం గ్రామాల్లో గురువారం విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసిత రైతుల సమస్యలు కోసం గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్ నర్సింహమూర్తి, ఏపీఐఐసీ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో కారిడార్ నిర్వాసిత రైతులు తమ సమస్యల గురించి వివరించారు. మూలపర్ర గ్రామంలో సర్పంచ్ పెదపూడి శంకరరావు, ఉప సర్పంచ్ గంటా నర్సింగరావు, సూరకాసుల గోవిందరావు, ఎరుపిల్లి అప్పలరాజులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నష్టపరిహారం, ప్యాకేజీలకు సంబంధించి కటాఫ్ డేట్ పొడిగించాలని కోరారు.

ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ

నక్కపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు మండల స్థాయి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో సీతారామరాజు మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఈవోపీఆర్‌డీ, పలువురు ఉప సర్పంచులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో.. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీల్లోని ఉపసర్పంచులు, వార్డుల సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ బీవీఎస్ రాజు మాట్లాడుతూ ఏపీ పంచాయతీరాజ్ చట్టం, గ్రామపంచాయతీ సమావేశాలు, గ్రామసభలు, పర్యవేక్షణ, తనిఖీ అధికారాలు, చెల్లింపులు విధివిధానాలు తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో 30 పంచాయతీలకు చెందిన 50 మంది వార్డుల సభ్యులు, ఉపసర్పంచులు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రమాద ప్రయాణం

- దెబ్బతిన్న రామారాయుడుపాలెం కల్వర్టు
- విద్యార్థులు, మహిళలు, వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం
- కన్నెత్తి చూడని మునిసిపల్ అధికారులు


స్కూల్ ఆటో నుంచి దిగి వెళ్లడానికి అవస్థ పడుతున్న విద్యార్థి


కల్వర్టు వద్ద ద్విచక్రవాహనాన్ని తీసుకువెళ్లేందుకు పడుతున్న తిప్పలు

ఎలమంచిలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని ఎలమంచిలి నుంచి రామారాయుడుపాలెం వార్డుకు రాకపోకలు సాగించే రోడ్డుపై ఉన్న కల్వర్టు గత వర్షాలకు దెబ్బతినడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టు పాడవడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు నిత్యం ప్రమాద ప్రయాణం చేయక తప్పడం లేదు. ఈ కల్వర్టు వద్ద వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారు. ప్రజలు ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కల్వర్టు వద్ద నీటి ఉధృతి పెరిగినప్పుడల్లా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రతి రోజూ ఎలమంచిలి మండలంలోని జంపపాలెం, రామారాయుడుపాలెం, షేకిళ్లపాలెం గ్రామాల ప్రజలే కాకుండా ఎగువన ఉన్న మరో 4 గ్రామాల ప్రజలు ఈ రహదారి మీదుగా ఎలమంచిలికి రాకపోకలు సాగిస్తుంటారు. గత వర్షాలకు ఈ కల్వర్టు దెబ్బతింది. రెండేళ్ల క్రితం ఇదే కల్వర్టు వద్ద నీటి ఉధృతికి ఒక వ్యక్తి ప్రమాదానికి గురై మృతి చెందిన సంగతి తెలిసిందే. రామారాయుడుపాలెం, జంపపాలెం గ్రామాల నుంచి నిత్యం ఎలమంచిలిలోని పలు పాఠశాలలకు ఆటోలు, ద్విచక్ర వాహనాలపై నిత్యం వెళ్లి వస్తుంటారు. వీరంతా నిత్యం పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని మునిసిపల్ అధికారులు, పాలకులు కల్వర్టును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

మినీ బ్రిడ్జి నిర్మించాలని ఆందోళన


దెబ్బతిన్న కల్వర్టు వద్ద సీఐటీయూ ప్రతినిధుల ఆందోళన

ఎలమంచిలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని రామారాయుడుపాలెం ప్రధాన రోడ్డుపై గత వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టు స్థానే మినీ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ గురువారం సీఐటీయూ ప్రతినిధులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల ప్రతినిధి చింతకాయల శివాజీ మాట్లాడుతూ కల్వర్టు దెబ్బతినడంతో పలు గ్రామాల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ధనుంజయ్, మణికంఠ, రైతులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో భారీ వర్షం

- పూడిమడకలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు


పూడిమడకలో విద్యుత్ స్తంభాలను వేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం రాత్రి వరకు అంచెలంచెలుగా వర్షం కురుస్తోంది. బుధవారం రాత్రి తీర ప్రాంతాలైన పూడిమడక, వాడపాలెం, లోవపాలెం, కొత్తపట్నం తదితర ప్రాంతాల్లో వీచిన భారీ గాలులకు ఆరు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈపీడీసీఎల్ సిబ్బంది అదేరోజు రాత్రి నుంచి పూడిమడకలో కొన్ని ప్రాంతాలకు, గురువారం ఉదయానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం కూడా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

చెరువును తలపిస్తున్న హైస్కూల్ ఆవరణ

- జంపపాలెం విద్యార్థులు, ఉపాధ్యాయుల అవస్థలు



ఎలమంచిలి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 17: చినుకు పడితే జంపపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ చెరువును తలపిస్తోంది. స్కూల్ ఆవరణలో కురిసిన వర్షపు నీరు బయటకు పోయేందుకు అవకాశం లేదు. దీంతో ఈ నీరు రోజుల తరబడి స్కూల్ ఆవరణలోనే నిలిచిపోతుంది. దీంతో 150 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చాలా మంది విద్యార్థులు జారిపోయి పడిపోతున్నారు. పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేడు పరిశ్రమలకు విద్యుత్ అంతరాయం

ఎస్. రాయవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ సోముదేవుపల్లి ఫీడర్‌లో ఉన్న గుడివాడ, గుర్రాజుపేట, బంగారమ్మపాలెం గ్రామాల్లో ఉన్న పరిశ్రమలకు, చినఉప్పలంలో ఉన్న ఆక్వా చెరువులు, హేచరీలకు శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ గురువారం ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఐదు గంటలపాటు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏయూ అంతర్ కళాశాలల కబడ్డీ విజేత 'సమత'

ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎలమంచిలి ప్రభుత్వ కళాశాల, కృష్ణా కాలేజి

విశాఖపట్నం (స్పోర్ట్స్), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం స్పోర్ట్సు బోర్డు నిర్వహించిన అంతర్ కళాశాల పురుషుల కబడ్డీ టోర్నీలో సమతా డిగ్రీ కాలేజీ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ పీజీ కాలేజి, డాక్టర్ వీఎస్ కృష్ణా కాలేజి ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలవగా, డాక్టర్ లంకలపల్లి బుల్లయ్య కాలేజి నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. ఏయూ ఇండోర్ స్పోర్ట్సు హాలులో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో సమతా డిగ్రీ కాలేజి 43-14 పాయింట్ల తేడాతో యలమంచిలి ప్రభుత్వ కాలేజి విజయం సాధించగా, మూడో స్థానానికి జరిగిన మ్యాచ్‌లో డాక్టర్ వీఎస్ కృష్ణా కాలేజీ 21-19 పాయింట్ల తేడాతో బుల్లయ్య కాలేజీపై గెలుపొందింది. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి, ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్సు సైన్సెస్ డైరక్టర్ ప్రొఫెసర్ ఎస్.విజయ్ మోహన్ ముఖ్య అతిథిగా హాజరై ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏయూ వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం విభాగాధిపతి డాక్టర్ ఎ.పల్లవి, వివిధ కళాశాలల ఫిజికల్ డైరక్టర్లు పాల్గొన్నారు.

'భూముల రీ సర్వేను ప్రతి రైతు వినియోగించుకోవాలి'


ఎలమంచిలి: జంపపాలెం గ్రామసభలో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దారు వరహాలు


పాయకరావుపేటరూరల్: గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో నిర్వహిస్తున్న రీ సర్వే భూ సమస్యల పరిష్కార గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఎస్.నర్సాపురంలో గురువారం నిర్వహించిన రీ సర్వే భూ సమస్యల పరిష్కార గ్రామసభలో ఆయన మాట్లాడుతూ భూముల విస్తీర్ణంలో గాని, ఫొటో మిస్ మ్యాచింగ్ వంటి సమస్యలుంటే రైతులు గ్రామ సభలో అర్జీలు ఇస్తే గరిష్ఠంగా 15 రోజులలో వాటిని పరిష్కరిస్తామన్నారు. గ్రామసభలో 9 అర్జీలు వచ్చినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పల్లెల మణికంఠస్వామి, మంచాల గోపి, డిప్యూటీ తహసీల్దారు జి.ఆనందరావు, రీసర్వే డీటీ రాజేంద్రప్రసాద్, ఆర్ఐ త్రినాథ్, వీఆర్‌వోలు రైతులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. రీ సర్వే భూ సమస్యలపై జంపపాలెంలో గురువారం గ్రామసభను నిర్వహించారు. తహసీల్దారు వరహాలు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులు రీ సర్వే లోపాలను అధికారుల దృష్టికి తెచ్చారు. గతంలో నిర్వహించిన రీ సర్వే తప్పులు తడకగా ఉందని, తమ భూముల కొలతల్లో వ్యత్యాసాలు ఏర్పడడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వివరించారు. రైతులు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలని తహసీల్దార్ వరహాలు కోరారు. అనంతరం పలువురు రైతులు గ్రామ సభలో అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీటీ వినయ్ పాల్గొన్నారు.

కోటవురట్లలో.. భూ రీసర్వేలో లోపాలు, తేడాలు ఉన్నా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ తిరుమలబాబు అన్నారు. గురువారం సుంకపూర్ సచివాలయంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ.. గతంలో రీసర్వే చేసినప్పుడు ఏమైనా తప్పులు, విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, భూ యాజమానిపేరు మార్పులు వంటివి పరిష్కరిస్తామన్నారు. ఇతర ప్రాంతాలలో ఉన్న భూ యాజమానుల పేరు మార్పు, భూమికి సంబంధించి వెబ్‌ల్యాండ్‌లో పేరు లేకపోవడం, రీసర్వేకి ముందు వెబ్‌ల్యాండ్‌లో పేరు ఉండి తరువాత కనిపించకపోయినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామ సభలో రైతుల నుంచి 44 ఫిర్యాదులు వచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డీటీ రమేష్, సర్వేయర్ శ్రీనివాసరావు, గ్రామసర్పంచ్ చిటికెల కాశీలక్ష్మి, జనసేన మండల పార్టీ అధ్యక్షులు సింగంపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్. రాయవరంలో.. మండలంలోని ధర్మవరం అగ్రహారంలో గురువారం తహసీల్దార్ జె.రమేష్‌బాబు, మండల సర్వేయర్ త్రిమూర్తి ఆధ్వర్యంలో రీ-సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు రీ-సర్వేలో జరిగిన పలు అవకతవకలపై 59 దరఖాస్తులు అందజేశారు. భూమి విస్తీర్ణంలో జరిగిన తప్పులపై 28, పేర్లుకు చెందిన తప్పులపై 6, సర్వే నంబర్లపై 1, ఆన్‌లైన్ సమస్యలకు సంబంధించి 7, పాస్ పుస్తకాలు అప్‌లోడింగ్ విషయంలో ఫొటోలకు చెందిన తప్పులపై 15, మరో రెండు సమస్యలపై రైతులు దరఖాస్తులు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో చల్లపల్లి సూరిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి


వాల్మీకికి నివాళులర్పించిన సమరసత ఫౌండేషన్ సభ్యులు

అచ్యుతాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడింపల్లిలో గురువారం వాల్మీకి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు అలంకరించి నివాళులర్పించారు. ఆయన రచించిన రామాయణం గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ధర్మప్రచారకులు కొల్లి అప్పారావు, మేడిశెట్టి వేంకటేష్, నాగమణి, యాండ్ర సూరిబాబు, శ్రీను, మణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో.. మండలంలోని ధర్మవరం అగ్రహారం జడ్పీ హైస్కూల్‌లో గురువారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రధానోపాధ్యాయుడు బి. శ్రీనివాసరావు ఉపాధ్యాయులతో కలిసి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ బోయవాడు అయిన వాల్మీకి ఆదర్శవంతమైన రామాయణాన్ని అందించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లలితాంబ, విమల, శోభ, అరుణ, ఆర్. అప్పలనాయుడు, గారా ప్రకాష్ పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో.. మండలంలోని మంగవరం ఉన్నత పాఠశాలలో గురువారం సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులకు వాల్మీకి జీవిత చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో సమరసతా సేవా ఫౌండేషన్ పాయకరావుపేట ఖండ సంయోజక్ నీలాపు వెంకటరెడ్డి, ధర్మప్రచార్ కట్టా వీరబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

నక్కపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు జడ్పీ హైస్కూల్‌లో గురువారం మధ్యాహ్న భోజనాన్ని ఎంపీటీసీ సభ్యుడు కుంచె మధు, హైస్కూల్ కమిటీ చైర్మన్ కె.బాబూరావు, పల్లా రాంబాబు, పల్లా నాగరాజు తదితరులు తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా ? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్, నాయక్ పాల్గొన్నారు.

నేడు కొక్కిరాపల్లి గురుకుల పాఠశాలలలో సైన్స్ ఫెయిర్

ఎలమంచిలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి కొక్కిరాపల్లి సమీపంలోని డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం ఉదయం సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మాణిక్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ, అనకాపల్లి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల నుంచి సైన్స్, గణితం, సోషల్, ఆర్ట్, క్రాఫ్టుకు చెందిన వివిధ రకాల ప్రాజెక్టులు ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె తెలిపారు.

నవోదయ విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ఎలమంచిలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జంపపాలెం ఉన్నత పాఠశాలకు చెందిన నవోదయ ఎంట్రన్స్ పరీక్షలు విద్యార్థులకు విజయలక్ష్మి వాటర్ ఎంటర్ ప్రైజెస్ నిమ్మదల నాగేశ్వరరావు మెటీరియల్ సరఫరా చేశారు. ఈ పుస్తకాలను విద్యార్థులకు హెచ్ఎం శాస్త్రి, ఉపాధ్యాయుడు బొడ్డేడ సత్యనారాయణ గురువారం అందజేశారు.

గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలి

పాయకరావుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి పంచాయతీ వార్డు సభ్యులు తమ వంతు కృషిచేయాలని ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్‌లో పంచాయతీల ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నర్సీపట్నం డీఎల్‌పీఓ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ గ్రామాల్లో వార్డు సభ్యులు తమ దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలు పంచాయతీ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, మండల పరిషత్ ఏఓ వర్మ, పంచాయతీ కార్యదర్శి వైవీ.సత్యనారాయణ పాల్గొన్నారు.

పల్లె పండుగలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమారపురం, ఈదటం, పాల్మన్‌పేట గ్రామాలలో గురువారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమాల్లో అధికారులు, సర్పంచులు, నాయకులు పలు సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎ. జయప్రకాశరావు మాట్లాడుతూ గ్రామసభలలో తీర్మానం చేసిన మేరకు ఎన్ఆర్‌జీఎస్ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కుమారపురంలో రూ.7 లక్షలు, ఈదటంలో రూ.6.5 లక్షలు, పాల్మన్‌పేటలో రూ.15 లక్షలతో సిమెంటు రోడ్లు నిర్మిస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో హేమలత, పంచాయతీరాజ్ ఏఈ కచేరి, కార్యదర్శులు వైవీ.సత్యనారాయణ, రాజేశ్వరి, సర్పంచ్ వెంకటరమణ, టీడీపీ నాయకులు నీలాపు మహేశ్‌రెడ్డి, రావాడ గోవిందరెడ్డి, సురేష్‌రెడ్డి, వైసీపీ నాయకులు పిరుమళ్ళ రామకృష్ణ, చిరంజీవిరెడ్డి, నీలాపు మహేశ్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో.. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు అన్నారు. గురువారం పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా మండలంలో జల్లూరు, టీ. జగ్గంపేట గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు వచ్చే నెలలో రోడ్లు మరమ్మతులు చేయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు జానకిశ్రీనివాసరావు, ఎంపీడీవో కాశీవిశ్వనాథం, మండల ఇంజనీర్ వర్మ, ఉపాధి ఏపీవో నాగరాజు, జల్లూరు సర్పంచ్ లాలం పద్మావతి, టి జగ్గంపేట సర్పంచ్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్. రాయవరంలో.. మండలంలోని దార్లపూడి, బంగారమ్మపాలెం, రేవుపోలవరం, గుడివాడ, పెదఉప్పలం, తిమ్మాపురం, పెదగుమ్ములూరు, చినగుమ్ములూరు, భీమవరం గ్రామాల్లో గురువారం పల్లె పండుగ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, మాజీ అధ్యక్షుడు ఎన్. వెంకటరాజు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, టీడీపీ ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి, గుర్రం రామకృష్ణ, సర్పంచులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో.. మండలంలోని సీహెచ్‌బీ అగ్రహారం, న్యాయంపూడి, కాగిత, డీఎల్‌పురం, చందనాడ గ్రామాల్లో గురువారం పల్లె పండుగ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో సీతారామరాజు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే పలు హామీలను నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఈ కార్యక్రమాల్లో కాగిత ఎంపీటీసీ సభ్యుడు ఆకేటి గోవిందరావు,సర్పంచ్ రెడ్డి వరహాలు, జడ్పీటీసీ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, కురందాసు నూకరాజు, టీడీపీ నాయకులు వెలగా శ్రీను, గింజాల లక్ష్మణరావు, , అడపా గణేశ్, జనసేన మండల శాఖ అధ్యక్షుడు వెలగా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబుకు గురువారం బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అధ్యక్షుడు పదిలం బెన్నబాబు శాలువా కప్పి, జ్ఞాపికను అందజేశారు. -బుచ్చెయ్యపేట

రీ సర్వే అంతా తప్పుల తడక

» తప్పులు సరిదిద్దేందుకే రెవెన్యూ సదస్సులు » ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు




రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రీ సర్వే పేరుతో వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లోని భూ సమస్యలను జటిలం చేసిందని ఎమ్మెల్యే కేఎస్ ఎన్ఎస్ రాజు విమర్శించారు. గురువారం పట్టణ శివారు అన్న వరం వెంకయ్యగారిపేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. భూ సమస్యలు సరిదిద్దుతామంటూ నాటి పాలకులు తూతూమంత్రంగా సర్వే చేసి రాళ్లుపాతి గ్రామాల్లో కొత్త వివాదాలకు తెర లేపారన్నారు. వాటిని సరిదిద్ది ప్రజల ఇబ్బందులు తీర్చేందుకు కూటమి ప్రభుత్వం ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదన్నారు. వాస్తవానికి రెవెన్యూ సదస్సులు నెలరోజులు సరిపోవని, మరింతకాలం పొడిగించాలని సీఎంను కోరనున్నామన్నారు. ఈ సదస్సులో స్థానికులు తీసుకుని వచ్చిన సమస్యలను ఎమ్మెల్యే రాజు స్వయంగా పరిశీలించి రెవెన్యూ అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సదస్సులో తహసీల్దార్ అంబటి రామారావు, డీటీ సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షులు బొడ్డేడ గంగాధర్, ఈర్లె శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.కోటపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కె.కోటపాడులో చెట్లు నరకడం, లైను మెయింటినెన్స్ నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.






కెరీర్‌పై విద్యార్థులకు అవగాహన

కె.కోటపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇంగ్లీషు, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌పై అవగాహన కల్పించుకుని ఉద్యోగాలు, పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని యూత్ సర్వీసెస్/ సెట్విస్ రిసోర్స్ పర్సన్ ఎస్.ఏ. బాబు అన్నారు. యువజన సర్వీసుల శాఖ, సెట్విస్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక అయ్యన్న విద్యాసంస్థలలో 8, 9, 10 తరగతులు, ఇంటర్, డిగ్రీ కాలేజీల విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కెరీర్ కౌన్సెలింగ్, యూత్ క్లబ్‌లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగానికి కావాల్సిన విద్యార్హతలున్నప్పటికీ ఇంటర్వ్యూలలో ఒత్తిడికి గురై సరైన కమ్యూనికేషన్ స్కిల్స్ లేక ఉద్యోగాలు పొందలేకపోతుంటారన్నారు. అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీం మాట్లాడుతూ యువత తమ అభిరుచి మేరకు కెరీర్‌ను నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో బి.వివేక్, యువజన సర్వీసుల శాఖ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

























దుర్గమ్మ ఆలయ హుండీ లెక్కింపు

» 35 రోజులకు రూ.5,95,089 ఆదాయం రాక



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అర్చకులు

నర్సీపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. జిల్లా దేవదాయశాఖ అధికారిణి కేఎల్ సుధారాణి, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్.శ్రీనివాస్, సీఐ రేణుకమ్మ, ఈవో సాంబశివరావు, ఉత్సవ కమిటీ సభ్యుల సమక్షంలో ఈ ప్రక్రియ సాగింది. 35 రోజులకు రూ.5,95,089ల ఆదాయం వచ్చినట్టు దేవదాయ శాఖ అధికారులు తెలిపారు.

'పశువైద్య కేంద్రంలో మందుల కొరతపై దృష్టి'



ఆస్పత్రి ఆవరణ పరిశీలిస్తున్న ఏడీ

కృష్ణాదేవిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి పశువైద్య కేంద్రాన్ని పాడేరు పశు సంవర్థక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ చందక నరసింహులు గురువారం తనిఖీ చేశారు. తొలుత సిబ్బంది హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. స్థానికంగా జరుగుతున్న పశువైద్య సేవలపై రైతుల ద్వారా తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మందుల కొరత అంశాన్ని పశు వైద్యాధికారిణి డాక్టర్ శిరీషా ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం సంయుక్త సంచాలకులు డాక్టర్ రాంబాబు, గొలుగొండ పశువైద్యాధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు



కొమిరలో మేకలకు నట్టల నివారణ మందు వేస్తున్న దృశ్యం

గొలుగొండ, అక్టోబరు 17: (ఆంధ్రజ్యోతి) : కొమిర గ్రామంలో గురువారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేశారు. ఈ సందర్భంగా పశు వైద్యశాఖ ఏడీఏ డాక్టర్ ఎం.రాంబాబు మాట్లాడుతూ నట్టల నివారణ ద్వారా జీవాల్లో వ్యాధి నిరోధకశక్తి పెరిగి పిల్లల్లో మరణాల సంఖ్య తగ్గుతుందన్నారు. శరీర బరువు వృద్ధి చెందుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ చందక నర్సింహులు, గొలుగొండ వైద్యాధికారి రమేష్, షిరీషా, టీడీపీ నాయకులు కర్రి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మూడు మండలాల్లో కుండపోత

» వాయుగుండం కారణంగా నర్సీపట్నం, మాకవరపాలెం, గొలుగొండ మండలాల్లో భారీ వర్షం » వరి పంటకు మేలు చేస్తుందని రైతులు ఆనందం



మాకవరపాలెంలో భారీగా వర్షం కురుస్తున్న దృశ్యం

నర్సీపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : వాయుగుండం కారణంగా గురువారం పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. నర్సీపట్నంలో ఎడతెరిపి లేకుండా నాలుగు గంటల పాటు ఏకధాటిగా పడడంతో ఎటుచూసినా జలమే కనిపించింది. ఉదయం ఏడు నుంచి పది గంటల వరకు తెరిపివ్వలేదు. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. 22వ వార్డు వెంకునాయుడుపేట ఎంపీపీ స్కూల్ నుంచి బొంతు వీధికి వెళ్లే రోడ్డులో వర్షపునీరు నిలిచి పోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఆర్టీసీ కాంప్లెక్స్, శివపురం, బ్యాంక్ కాలనీ, ప్రశాంతి నగర్‌లలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక వర్షపు నీరు మెయిన్ రోడ్డులో నిలిచి పోవడంతో జనం అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.

మాకవరపాలెం : మండలంలో గురువారం ఉదయం సుమారు రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా ఎండలు మండుతుండడంతో వరినారు మడులకు తడులు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ తరుణంలో వాయిగుండం కారణంగా మాకవరపాలెం, తామరం, భీమబోయినపాలెం, రామన్నపాలెం, రాచపల్లి గ్రామాల్లో వర్షం పడడంతో వరిపంట పొలాలకు నీరు చేరి ఊపిరి పోసినట్టైంది. అన్నదాతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గొలుగొండ/కృష్ణాదేవిపేట : మండల వ్యాప్తంగా గురువారం వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. దీంతో గొలుగొండ, జోగంపేట, పాతమల్లంపేట, పాకలపాడు, రావణాపల్లి, చీడిగుమ్మల, కొత్తఎల్లవరం, గుండుపాల, ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్.నాగాపురం, పల్లావూరు, పాతకృష్ణాదేవిపేట,చోద్యం, లింగంపేట తదితర గ్రామాల్లో వాతావరణం చల్లబడింది.



కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో...

రీ సర్వేలో తప్పుల సవరణకే గ్రామ సభలు



ధారపాలెంలో అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

మాకవరపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల రీ సర్వేలో తప్పిదాలను సరిదిద్దేందుకే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్ అన్నారు. మండలంలోని తాడపాలలో గురువారం ఏర్పాటైన సదస్సులో మాట్లాడారు. గతంలో భూముల రీసర్వే పూర్తయినప్పటికీ కొంతమేర తప్పిదాలు జరిగాయన్నారు. అలాంటి సమస్యలు ఉంటే దరఖాస్తు చేస్తే పరిష్కారిస్తామని వివరించారు. దీంతో పలువురు రైతులు తమ భూములు అన్‌లైన్ లేవంటూ దరఖాస్తులు చేశారు. డీటీ కృష్ణమూర్తి, ఆర్ఐ జట్టి, వీఆర్‌వో రమణ తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని ధారపాలెంలో గురువారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దరఖాస్తులను అందజేశారు. భూముల రీసర్వేలో జరిగిన తప్పిదాలు సరిచేయాలని విన్నవించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రీ సర్వే అనంతరం భూ సమస్యలు ఉన్న వారు సభ దృష్టికి వారి సమస్యలను తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీ చైనులు, పాతమల్లంపేట సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాకలపాడు సచివాలయ టెక్నికల్ అసిస్టెంట్‌కు మెమో

» పింఛన్ల పంపిణీలో మిగులు నగదు ఇవ్వనందుకు ఇన్‌చార్జి ఎంపీడీవో ఆగ్రహం

గొలుగొండ, అక్టోబరు 17 : (ఆంధ్రజ్యోతి) : పింఛన్ల పంపిణీ అనంతరం మిగిలిన నగదుపై ఎటువంటి సమాచారం తెలపని సచివాలయ టెక్నికల్ అసిస్టెంట్‌కు మెమో జారిచేసినట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పాకలపాడు పంచాయతీలో మొత్తం ఆరు వందలు పింఛన్లు ఉండగా, సెప్టెంబరుకు సంబంధించిన పింఛన్లు అక్టోబరు నెలలో పంపిణీకి చర్యలు చేపట్టారు. అయితే ఈ ఆరు వందల పింఛన్లలో 578 లబ్ధిదారులకు పింఛన్ల నగదును అందజేశారు. మిగిలిన నగదుపై సచివాలయ టెక్నికల్ అసిస్టెంట్ కె.అశోక్ కుమార్ ఈనెల ఐదో తేదీలోగా ప్రభుత్వ ఖాతాలో జమ చేయాల్సి ఉంది. అయితే ఆ నగదు ప్రభుత్వ ఖాతాలో జమ చేయలేదు. సరికదా మండల పరిషత్ అధికారులకు తెలియజేయక పోవడంతో ఆయ నకు మెమో జారీ చేసినట్టు చెప్పారు. ఈ అంశంపై ఉన్నతాధికారులకు సమాచారం అందిం చామన్నారు. దీనిపై టెక్నికల్ అసిస్టెంట్‌ను ఇన్‌చార్జి ఎంపీడీవో ఫోన్‌లో వివరణ కోరగా, తనకు ఆరోగ్య పరిస్థితి బాగోకపోవడంతో విశాఖపట్నం ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నట్టు తెలిపారని తెలిపారు.

'గ్రామస్థాయిలో వార్డు సభ్యుల పాత్ర కీలకం'

మాకవరపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని ఎంపీడీవో సీతామహాలక్ష్మి అన్నారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వార్డు సభ్యులు, ఉప సర్పంచ్‌లకు ఏర్పాటైన శిక్షణ తరగతుల్లో మాట్లాడారు. ప్రతి వార్డు సభ్యుడు పంచాయతీ అభివృద్ధిలో పాలు పంచుకోవాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు మాట్లాడుతూ సమష్టి కృషితోనే గ్రామాల ప్రగతి సాధ్యమన్నారు. ఈ దిశగా అధికారులు, పంచాయతీల పాలకులు కృషిచేయాలన్నారు. ప్రధానంగా వార్డు సభ్యులు విధులు, అధికారాలను గురించి తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

'మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు'

నర్సీపట్నం, అక్టోబరు 17 : ప్రైవేటు మద్యం దుకాణాలలో ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఎంఆర్‌పీ కంటే అధికంగా మద్యం విక్రయించడం నేరమన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలలో 20,809 మద్య బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కొత్తగా 21 ప్రైవేటు మద్యం దుకాణాలకు గాను 20 మంది మద్యం విడిపించుకున్నారని తెలిపారు. 17 షాపులు తెరుచుకొని అమ్మకాలు జరుగుతున్నాయని వివరించారు. శుక్రవారం మరో మూడు మద్యం షాపులు తెరచుకోనున్నాయన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

నర్సీపట్నం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకి మహర్షి జయంతిని గురువారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశా లలో ప్రిన్సిపాల్ ఎస్.రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని జరిపారు. పెదబొడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సీహెచ్.ప్రాన్సిస్, శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి దమయంతి ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అల్లు అప్పారావు, బాబీ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో సమస్యలకు శాశ్వత పరిష్కారం

బుచ్చెయ్యపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రీసర్వేలో చోటుచేసుకున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే గ్రామ సభల లక్ష్యమని తహసీల్దార్ ఎం.లక్ష్మి అన్నారు. గురువారం కరకలో నిర్వహించిన రెవెన్యూ సభలో ఆమె మాట్లాడుతూ.. రైతులు ఇబ్బందులను తెలుసుకుని ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఫిర్యాదు చేసిన ప్రతి రైతుకు రశీదు ఇస్తామన్నారు. ఈ సభలో ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, ఎంఆర్ఐ శ్రవణ్, వీఆర్వోలు జేవీ.రమణ, ఏ.తులసీరావు, ఎస్.రమణ, సర్వేయర్లు వినోద్, అపర్ణ, గోవిందు, సాయి, సంతోషం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దేవరాపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని పినకోట ఫీడర్‌లో గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఏఈఈ కర్రి శంకరరావు గురువారం తెలిపారు. పినకోట ఫీడర్‌లో ఉన్న వాలాబు, శ్రీరాంపురం, పినకోట, పెదకోట, కివర్ల పంచాయతీలో గ్రామాలకు ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

అధిక ధరలకు మద్యం అమ్మితే చర్యలు : సీఐ

» ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బుచ్చెయ్యపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఎమార్పీ ధరలకు కాకుండా అధిక ధరలకు మద్యం అమ్మితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ బాపునాయుడు హెచ్చరించారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'అధిక ధరలపై మందుబాబుల ఆగ్రహం' వార్తకు ఆయన స్పందించారు. బుచ్చెయ్యపేట కూడలిలో మద్యం షాపు యాజమాన్యం మద్యం అధిక ధరలకు విక్రయించడంపై విచారణ చేయగా, తొలిరోజు కావడంతో ధరలపై అవగాహన లోపంతో అధిక ధరలకు తాము అమ్మకాలు చేపట్టినట్టు యాజమాని తెలిపారన్నారు. ఎమ్మార్పీ ధరలపై షాపు యాజమానికి అవగాహన కల్పించామన్నారు. బడికి, ఆలయాలకు 100 మీటర్ల లోపు మద్యం షాపులు ఏర్పాటు చేయరాదన్నది ప్రభుత్వ నిబంధన అని సీఐ బాపునాయుడు తెలిపారు.

షిర్డీ సాయిబాబా ఆలయంలో అన్నసమారాధన

రావికమతం, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ఏర్పాటు చేసిన మహా అన్న సమారాధనను డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ గుమ్మడు సత్యదేవ ప్రారంభించారు. మొదటి వారం గ్రామానికి చెందిన పెనుగొండ మల్లేశ్వరరావు రమా దంపతులు సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇకపై ప్రతి గురువారం క్రమం తప్పకుండా అన్న సమారాధనను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పూడి దేవ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలంటూ గిరిజన రైతులు నిరసన

చీడికాడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం గుంటుకొత్తూరు గిరిజన రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కోనాం శివారు గుంటుకొత్తూరు గ్రామానికి చెందిన గిరిజన సంఘం నాయకుడు జన్ని లక్ష్మణరావు మాట్లాడుతూ, తరతరాలుగా తాము సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇచ్చారని, దీన్ని సాగుచేసుకొని జీవిస్తున్నామన్నారు. అయితే అక్కడ ఎటువంటి భూములు లేకుండా కొంతమందికి పట్టాలు ఇవ్వడంతో భూస్వాములు వచ్చి తమను అడ్డుకొంటున్నారన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజనులు, రైతులు పాల్గొన్నారు.

గాదిరాయిలో పశువైద్య శిబిరం

మాడుగుల రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాదిరాయిలో గురువారం జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. 36 పశువుల్లో గర్భకోశ వ్యాధులకు, 12 ఎదకు రాని పశువులకు, 8 పశువులకు చూడి పరీక్షలు నిర్వహించినట్టు పశువైద్యాధికారి మణి లక్ష్మణ్ తెలిపారు. 30 పెయ్యిలకు నట్టల నివారణ మందులు, 40 పశువులకు సాధారణ చికిత్సలు చేశామన్నారు. ఈ శిబిరం ద్వారా 76 మంది పాడి రైతులకు లబ్ధిచేకూరిందని తెలిపారు. 25 మంది పాడి రైతులకు మినరల్ మిక్సర్ ప్యాకెట్లు, లివర్ టానిక్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంటకోట జగన్నాథరావు, టీడీపీ మండల అధ్యక్షులు అద్దిపల్లి జగ్గారావు, ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు, వీఎల్‌వో సత్యం, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మాడుగులలో వర్షం

మాడుగుల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మాడుగులలో గురువారం భారీ వర్షం కురిసింది. తెల్లవారి జాము నాలుగు గంటల సమయంలో మోస్తరు వర్షం కురిసిన అనంతరం తెరిపినిచ్చింది. అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటన్నర సమయంలో భారీగా వర్షం కురిసింది. దీంతో పంట పొలాల్లోకి నీరు చేరింది. వాతావరణం చల్లబడింది.

'పంచాయతీ పాలన విధులపై అవగాహన అవసరం'

దేవరాపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పాలన విధులపై పాలక సభ్యులకు అవగాహన ఉండాలని ఎంపీడీఓ సువర్ణరాజు అన్నారు. ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అధ్యక్షతన గురువారం పంచాయతీ ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు పరిపాలన, విధులపై శిక్షణ ఇచ్చారు. రెండు రోజులుపాటు ఈశిక్షణ జరుగు తుందన్నారు. ప్రతి పంచాయతీ నుంచి ఉపసర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యులు శిక్షణ ఇస్తున్నామన్నారు. పంచాయతీ బాధ్యతలు, విధులు నిర్వహణ, అభివృద్ధిలో పాలకవర్గ సభ్యుల పాత్ర గురించి శిక్షణ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, తది తరులు పాల్గొన్నారు.

పైసా బిల్లు చెల్లించలేదు

» గోకులం షెడ్ల లబ్ధిదారులు ఆరోపణ

» విచారణ అధికారుల వద్ద గోడు వినిపించిన బాధితులు



కొమిర రైతులతో మాట్లాడుతున్న విచారణ అధికారి

రావికమతం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అప్పులు చేసి గోకులం షెడ్లు నిర్మాణాలు పూర్తి చేశామని, పైసా బిల్లు ఇంతవరకు ప్రభుత్వం నుంచి అందలేదని పలువురు లబ్ధిదారులు ఆరోపించారు. గురువారం గుమ్మళ్లపాడు, కొమిర, గర్నికం గ్రామాల్లో గోకులం షెడ్లు బిల్లులు అందని లబ్ధిదారులను స్పెషల్ సోషల్ ఆడిట్ ఆఫీసర్లు డి.రాజేంద్ర, వరప్రసాద్ విచారించారు. వారి వద్ద నుంచి లిఖితపూర్వకంగా వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా గోకులాలు నిర్మించిన లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు ఐదు నుంచి పది వేలు రూపాయలు ఇచ్చారని కొందరు చెప్పగా.. మరికొందరు మెటీరియల్ రేకులు, ఆరు ఇనుప పైపులు మాత్రమే ఇచ్చారని చెప్పడంతో విచారణాధికారులు అవాక్కయ్యారు. 2018లో టీడీపీ ప్రభుత్వం హయాలంలో మండలంలో కొత్తకోట, దొండపూడి, టి.అర్జాపురం, పి.పొన్నవోలు, మేడివాడ, గర్నికం, రావికమతం, గుమ్మళ్లపాడు, చినపాచిల, మత్స్యపురం తదితర గ్రామాలలో 41 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. అప్పట్లో వీటి నిర్మాణ బాధ్యతను సాయి బాలాజీ ఎంటర్ ప్రైజెస్‌కి ప్రభుత్వం అప్పగించింది. రైతులు నిర్మించిన షెడ్లకు నాలుగు విడతలుగా బిల్లులు మంజూరు చేయాల్సి ఉన్నప్పటికీ పశుసంవర్థక శాఖ ఉన్నతాధికారులు, సాయిబాలాజీ ఎంటర్ ప్రైజెస్ కంపెనీ యాజమాన్యం కుమ్మక్కై.. రైతుల బిల్లుల మొత్తాలను సాయి బాలాజీ ఎంటర్ ప్రైజెస్ ఖాతాకు బదలాయించారు. గోకులం షెడ్లకు బిల్లులు వస్తాయని ఆశతో ఎదురుచూసిన రైతులకు రాకపోవడంతో పలు మార్లు ఆందోళన చేశారు. ఈలోగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఐదేళ్ల గోకులం రైతులను పట్టించుకోలేదు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గోకులం షెడ్లపై, నిధుల దుర్వినియోగంపైన సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు స్పెషల్ సోషల్ ఆడిట్ అధికారులు రైతులు నిర్మించిన షెడ్లు వద్దకు వెళ్లి విచారణ చేస్తున్నారు. నిర్మించిన షెడ్లకు బిల్లు చెల్లించారా? లేదా? ఆరా తీశారు. ఒకవేళ బిల్లు చెల్లిస్తే ఎంత మేరకు ఇచ్చిందీ వంటి వివరాలు సేకరిస్తున్నారు. అలాగే రైతుల ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాల జెరాక్స్‌లతోపాటు వారి నుంచి లిఖిత పూర్వకంగా స్టేట్‌మెంట్లు తీసుకుంటున్నారు.దీంతో రైతులు అప్పుల పాలైయ్యామంటూ గోడు వినిపించుకున్నారు. ఈ విషయమై విచారణ అధికారి రాజేంద్రను వివరణ కోరగా.. తమ విచారణ పూర్తి కాలేదని, షెడ్లు నిర్మాణాలు చేసిన రైతులను విడివిడిగా కలిసి విచారణ చేస్తున్నామన్నారు. కొంత మందికి బిల్లు చెల్లించారని, మరికొందరికి బిల్లు చెల్లింపు జరగలేదని పేర్కొన్నారు. అంతా గందరగోళంగా ఉందన్నారు. సమగ్ర దర్యాప్తు చేసిన తర్వాత వాస్తవాలు వెల్లడిస్తామన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి : ఆర్డీఓ



రత్నంపేటలో సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ వీవీ రమణ

రోలుగుంట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రీసర్వే గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చే వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ వీవీ రమణ ఆదేశించారు. గురువారం బీజీపేట రెవెన్యూ గ్రామానికి సంబంధించిన రెవెన్యూ సదస్సును రత్నంపేట సచివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో వీవీ రమణ మాట్లాడుతూ.. ఈ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలి రోజు నిర్వహించిన సదస్సులో 8 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ శంకరరావు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రామమూర్తి, వీఆర్వో అప్పారావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 51 ఫిర్యాదులు

రావికమతం: మండల కేంద్రంలోని సచివాలయంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో వివిధ భూ సమస్యలపై 51 మంది రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.వెంకట రమణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో రీ సర్వేలో తమకున్న భూమిని తక్కువగా నమోదు చేశారన్నారు. కొన్నింటికి ఫోన్ నంబర్లు లింక్ చేయలేదని, భూమి ఒక్కరిదైతే సాగు వేరొకరిపేరు నమోదు జరిగిందని, సర్వే నంబర్లు తప్పుగా పడ్డాయంటూ ఫిర్యాదు అందాయి.

మార్చిలోగా పూర్తి చేసిన ఇళ్లకే బిల్లులు : ఎంపీడీవో

రోలుగుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మార్చిలోగా పూర్తి చేసిన ఇళ్లకు మాత్రమే బిల్లులు మంజూరవుతాయని ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో ప్రభుత్వం నూతన ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. గతంలో ఎన్టీఆర్ పథకంలో మధ్యలో ఆగిపోయిన ఇళ్లకు సర్వే పూర్తిచేసినట్టు తెలిపారు. మూడేళ్ల నుంచి కుసర్లపూడి జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎంపీడీఓ మాట్లాడుతూ.. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వైద్యాధికారులు సునీత, శిరీష, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్‌బాబు, ఉపాధి ఏపీవో ఈశ్వరరావు, ఎంఈఓ జగ్గారావు, హౌసింగ్ ఏఈ గణేష్ తమ శాఖల ప్రగతి నివేదికలను సభకు వినిపించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు పోతల లక్ష్మిరమణమ్మ పాల్గొన్నారు.

సకాలంలో మందులు వాడితే క్షయను నివారించవచ్చు

» రావికమతం వైద్యాధికారి శ్రీనివాస్

రావికమతం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ వ్యాధి పూర్తిగా నయం అవుతుందని రావికమతం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. మేడివాడలో గురువారం క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరచూ దగ్గు, కఫం అధికంగా వస్తే సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లి తనఖీలు చేయించుకోవాలన్నారు. వ్యాధిని సకాలంలో గుర్తించి అవసరమైన మందులు వాడితే ఇది పూర్తిగా నయమైయ్యిపోతుందన్నారు. అనంతరం 25 మంది నుంచి శాంపిల్స్ సేకరించారు. అనంతరం గర్నికం కేజీబీవీలో కిషోర్ బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో చోడవరం సీహెచ్‌సీ గైనికాలజిస్ట్ డాక్టర్.స్మృతి, సీహెచ్ఓ కె.హేమ సుందర్రావు, ఎస్‌టీఎల్ఎస్ సత్తిబాబు, ఎస్టిఎస్ కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

మాడుగుల అభివృద్ధిలో రెడ్డిదే కీలకపాత్ర

» రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్యబాబు



సమావేశంలో మాట్లాడుతున్న తాతయ్యబాబు

చీడికాడ, అక్టోబరు 17: మాడుగుల నియోజకవర్గం అభివృద్ధిలో మాస్టర్, మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణదే కీలకపాత్ర అని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు అన్నారు. గురువారం పల్లె పండుగ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తనను రెడ్డి సత్యనారాయణ తెలుగుదేశం పార్టీలోకి తీసుకువచ్చారన్నారు. ఆయన అడుగుజాడల్లో ఈ స్థాయికి ఎదిగానని అన్నారు. రెడ్డి సత్యనారాయణ పేరును ఏదో ఒక పథకానికి పెట్టాలని నిర్ణయించుకున్నామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, రెడ్డి రాము, రెడ్డి జయమ్మ, ఎంపీడీవో హేమసుందర్, అధికారులు పాల్గొన్నారు.

జగన్ హయాంలో అవినీతికే అధిక ప్రాధాన్యం

» ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



ఎమ్మెల్యే బండారుని సన్మానిస్తున్న పెదగోగాడ టీడీపీ నాయకులు

చీడికాడ, అక్టోబరు 17: వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కన్నా అవినీతికే అధిక ప్రాధాన్యం ఇచ్చారని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. పల్లె పండుగలో భాగంగా మండలంలోని 11 పంచాయతీల్లో నిర్మించనున్న సీసీరోడ్లు, డ్రైనేజీలకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కనీసం సాగునీటి సమస్యకు ఒక్క రూపాయి కూడా నిధులు మంజూరు చేయలేదన్నారు. కోనాం జలాశయం మరమ్మతులకు కోటి రూపాయలు మంజూరు చేయించానన్నారు. అలాగే చీడికాడ మండలంలో విద్యుత్ సమస్య అధికంగా ఉందని, దీన్ని నివారించేందుకు జిల్లాఅధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మట్టా అప్పారావు, కొల్లి సూరినాయుడు, కె.భాగ్యలక్ష్మి, చలుగు ఈశ్వరమ్మ, శీరంరెడ్డి లక్ష్మి, బండారు వెంకటలక్ష్మి, బీళ్ల కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీలు పాత్రిన సింహాచలంనాయుడు, కుచ్చు కళావతి, టీడీపీ నాయకులు గండి మునలినాయుడు, రెడ్డి సన్యాసినాయుడు, బండారు దయాకర్ పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తిని టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు.

గ్రామాలభివృద్ధికి చర్యలు తీసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ

మాడుగుల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల గ్రామ పంచాయతీల్లో తాగునీరు, పారిశుధ్యం పనులు చేపట్టేందుకు పంచాయతీ అధికారులు కృషి చేయాలని ఈవోపీఆర్డీ కె. కరుణాకర్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో మార్పులు కారణంగా గ్రామాల్లో రోగాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

కొలువుదీరిన గౌరీపరమేశ్వరులు

▸ అనకాపల్లిలోని గవరపాలెం కోట వీధిలో పీలావారి ఉత్సవం ఆరంభం


మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ గౌరీపరమేశ్వరుల విగ్రహం ఊరేగింపు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెం కోటవీధి వద్ద వినాయక గౌరీ సేవా సమితి ఆధ్వర్యంలో పీలావారి గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవం బుధవారం రాత్రి అత్యంత ఘనంగా జరిగింది. నేలవేషాలు, మంగళవాయిద్యాల మధ్య కోటవీధిలోని ఆలయంలో అమ్మవారిని నిలుపు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమరశెట్టి శ్రీనివాసరావు, భీమరశెట్టి వరహా నూకరాజు, బుద్ద బల్లమ్మనాయుడు, మారిశెట్టి జగన్నాథరావు, భీమరశెట్టి లక్ష్మీనారాయణ, దాడి రామకృష్ణ, బుద్ద శివ తదితరులు పాల్గొన్నారు.

మొగలిపురంలో...


వరి దుబ్బుకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

సబ్బవరం : మండలంలోని మొగలిపురంలో గురువారం గౌరమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలుత గ్రామ వీధుల్లో గౌరీదేవి (వరి దుబ్బు)కి మేళతాళాలు, బాజాభజంత్రీల నడమ ఊరేగింపు నిర్వహించారు. పూజల అనంతరం మండపంలో ప్రతిష్ఠించారు. ప్రతి ఏటా అక్టోబరు నెలలో వచ్చే పౌర్ణమి రోజున ఈ ఉత్సవాలు నిర్వహిస్తుంటామని గ్రామ పెద్దలు తెలిపారు. వరి పంట ఆశాజనకంగా పండి, రైతులకు అన్నివిధాలా మంచి జరగాలని వేడుకుంటూ ఇక్కడ ఈ ఉత్సవం జరుపుతుంటారు. కర్రివారి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో స్థానిక నేతలు గండి రవికుమార్, ఉప సర్పంచ్ సిరపురపు వాసు, ఐడి బాబు, దేముడు, కనకరాజు, బంగారయ్య, సత్యనా రాయణ, గండి రవి యువ సైన్యంతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే ఎజెండా : కొణతాల


చింతలపాలెంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కొణతాల, పీలా

కశింకోట, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి) : పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని చింతలపాలెం, గొబ్బూరు, ఏఎస్‌పేట, సోమవరం గ్రామాల్లో మంజూరు చేసిన రోడ్లు, కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఏడాదిలోపే నియోజక వర్గంలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ మంచినీటి కొళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. తొలుత వారు సోమవరం గ్రామంలో మరిడిమాంబ పండుగ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కూటమి నాయకులు గొంతిన శ్రీనివాసరావు, కాయల మురళీ, గొంతిన నానాజీ, కర్రి వెంకట సత్యనారాయణ, నిమ్మదల తాతినాయుడు, కర్రి దుర్గినాయుడు, చిరంజీవి, నైనంశెట్టి రమణారావు, ప్రకాష్, నాగేశ్వరరావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : కుల వృత్తులు, చేతివృత్తుల వారి ఆర్థికాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని గుండాల జంక్షన్‌లో గల ఓ సమావేశ మందిరంలో ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక పనిముట్లను అందజేయడానికి విశ్వకర్మ పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారని, అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, భాస్కరరావు, నీలబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఉల్లాస్'తో అక్షర వెలుగులు

▸ పథకం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి ▸ అధికారుల సమీక్షలో కలెక్టర్ విజయ కృష్ణన్



అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. ఉల్లాస్ కార్యక్రమంపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉల్లాస్ పథకంపై ప్రచారం కల్పించి జిల్లాకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. 2024-25 సంవత్సరానికి 11,900 మందికి వయోజన విద్యనందించడమే లక్ష్యంగా ప్రణాళికను రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. అక్షరాస్యత శాతం తక్కువగా ఉన్న మండలాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అక్షరాస్యత పెంచేందుకు పంచాయతీరాజ్, సచివాలయం, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ, విద్యాశాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. అంగన్‌వాడీ, పాఠశాలల్లో పని చేస్తున్న కిందస్థాయి సిబ్బంది, స్వయం సహాయక సంఘాలు ఉపాధి హామీ కూలీల్లో నిరక్షరాస్యులైన వారిని గుర్తించి ఆ సమాచారాన్ని వయోజన విద్యాధికారులకు అందించి ఈ పథకం ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు.

శారదానగర్‌లో మద్యం దుకాణం ఏర్పాటుపై ఫిర్యాదు


ఎక్సైజ్ సీఐకు ఫిర్యాదు చేస్తున్న శారదానగర్ వాసులు

కొత్తూరు, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కొత్తూరులోని శారదానగర్‌లో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని కోరుతూ శారదానగర్ పరిరక్షణ సమితి ప్రతినిధులు తాడి చక్రవర్తి, వేజర్ల వర్మ, సత్తిబాబు, శంకర్‌ప్రసాద్ తదితరులు ఎక్సైజ్ సీఐ లక్ష్మణనాయుడుకు గురువారం ఫిర్యాదు చేశారు. కొన్నేళ్ల క్రితం ఈ ప్రాంతంలో ఎటువంటి మద్యం షాపులు ఏర్పాటు చేయకూడదని పంచాయతీలో తీర్మానం చేసుకున్నామని వివరించారు. ప్రధానంగా ఈ ప్రాంతంలో పాఠశాలలు, ఆలయాలు ఉండడంతో పాటు, నిత్యం ప్రధాన రోడ్డుపై ఎంతో మంది రాకపోకలు సాగిస్తుంటారన్నారు. అటువంటి ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం తామంతా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. తక్షణమే మద్యం దుకాణాన్ని జనసంద్రం లేని చోటకు తరలించాలని ఆ ఫిర్యాదులో వారంతా విన్నవించారు.

వాల్మీకి మహర్షికి ఘన నివాళి


వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రతినిధులు

పరవాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకి మహర్షి జయంతిని నాయుడుపాలెం జంక్షన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి సమర సత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు పైలా తాతబాబు, చుక్క నాయుడు పూలమాల వేసి నివాళిర్పించారు. అనంతరం మాట్లాడుతూ రామాయణాన్ని రచించి అందరికీ అందుబాటులో ఉంచిన మహానుభావుడు వాల్మీకి ఆయన పేర్కొన్నారు. ఫౌండేషన్ ప్రతినిధులు వెన్నెల అప్పలనాయుడు, నారాయణరావు, రాజేష్, నర్సింహులు, రాజు, అచ్చెంనాయుడు, పైలా సత్తిబాబు, లాలం అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు స్టైరెక్స్ పరిశ్రమ సాయం


కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న సంస్థ వైస్ ప్రెసిడెంట్

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ వరద బాధితులకు పరవాడలో గల స్టైరెక్స్ ఫార్మా పరిశ్రమ బాసటగా నిలిచింది. సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎం.వెంకటరెడ్డి గురువారం అనకాపల్లిలో కలెక్టర్ విజయ కృష్ణన్‌ను కలిసి రూ. రెండు లక్షల 50వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.


నేడు విద్యుత్‌కు అంతరాయం

కశింకోట, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సింగబిల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11కేవీ ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ ఒక ప్రకటలో తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నర్సింగబిల్లి, ఎన్‌జీ పాలెం, గొబ్బూరు, చింతలపాలెం, త్రిపురవానిపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినపాలెం, కొత్తపల్లి, ఏనుగుతుని, సోమవరం, చిన ఏనుగుతుని, గొల్లగుంట, జి.భీమవరం, అడ్డాం, అచ్చెర్ల, కొత్తఅచ్చెర్ల, మోసయ్యపేట, గోకవానిపాలెం, బుచ్చియ్యపేట, గంటవానిపాలెం, జోగారావుపేట, పేరంటాలపాలెం, తాళ్లపాలెం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, కొత్తపల్లి, ఏఎస్‌పేట, గ్రామాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులంతా సహకరించాల్సిందిగా కోరారు.

వర్షాలతో పల్లె పండుగ వాయిదా

కొత్తూరు/కశింకోట : వర్షాలు పడుతున్న నేపథ్యంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరగాల్సిన పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాలను వాయిదా వేస్తున్నట్టు ఎంపీడీవో ఎ.రవికుమార్ తెలిపారు. తాజా వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అనకాపల్లి, కశింకోట మండలాల్లో జరగాల్సిన ఈ కార్యక్రమాలను వాయిదా వేసినట్టు చెప్పారు. మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తామనే విషయాలను త్వరలో వెల్లడిస్తామన్నారు.

యువత ఓటర్లుగా నమోదు కావాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అర్జునరావు

సబ్బవరం, అక్టోబరు 17 : ప్రజాస్వామ్య పరిరక్షణకు పద్ధెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని ఎంపీడీవో పి.పద్మజ, తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, సబ్బవరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మీ కోరారు. ఇక్కడి కళాశాలలో గురువారం ఓటరు నమోదుపై ఏర్పాటైన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఓటు విలువను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఓటు ఓ వజ్రాయుధం వంటిదని, యువత ఓటర్లుగా చేరాలని సూచించారు. అనంతరం ఓటు నమోదు చేసుకునే విధానంపై ఎస్‌వీవీపీ అర్జునరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వీరయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్‌లతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

30 వరకు పీఏసీఎస్ సభ్యుల ఈకేవైసీ గడువు

సబ్బవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంలో గల దుర్గమాంబ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యత్వం కలిగిన వారు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని సంఘం కార్యదర్శి గొంప రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30 వరకు ఇందుకు సంబంధించి గడువు ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే పలు మాధ్యమాల ద్వారా సభ్యు లకు సమాచారం ఇచ్చినట్టు వివరించారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు


ఆలయంలో కలశ పూజ చేస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి ప్రతిష్ఠా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఉత్సవమూర్తితో నగర సంకీర్తన జరిపారు. ఆలయంలో మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, నీరాజన మంత్ర పుష్పాలు చేపట్టారు. రేజేటి రామాణాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ మండపంలో అమ్మవారికి 108 కలశాలతో ప్రత్యేక పూజలు, చండీహోమం వంటివి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ గ్రంధి శేష కుమార్, కోరుకొండ బుచ్చిరాజు, బిళ్లపాటి కృష్ణకుమార్, కొరుపోలు జగదీశ్వరరావు, శ్రీధరాల సోమరాజు, వుప్పల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దేవీపురంలో ముగిసిన దసరా బ్రహ్మోత్సవాలు


అమ్మవారికి అలంకరణలు చేస్తున్న నిర్వాహకులు

సబ్బవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవీపురంలో దసరా బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సహస్రాక్షి అమ్మవారికి పంచామృతాభిషేకం, లలితా సహస్ర నామావళి వంటి వాటిని నిర్వహించారు. అనంతరం కామేశ్వరీ కళ్యాణాన్ని నేత్రపర్వంగా జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. గురుపత్ని అన్నపూర్ణమ్మ ప్రారంభించారు. సాయంత్రం జలహారతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీవిద్యా ట్రస్టు నిర్వాహకులు కందర్ప రమా, ప్రభాకర్‌లతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'విశాఖ డెయిరీ పాల సేకరణ ధర తగ్గింపు తగదు'



సమావేశంలో మాట్లాడుతున్న వైఎన్ భద్రం

తుమ్మపాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : విజయ్ విశాఖ డెయిరీకి ఆవు పాలు పోస్తున్న రైతులకు కొనుగోలు ధరలో లీటరుకు మూడు రూపాయలు కోత విధించడం తగదని సీపీఐ అనకాపల్లి ఏరియా కమిటీ మండిపడింది. ఇక్కడి పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో పార్టీ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం మాట్లాడుతూ రైతుల శ్రమతో కోట్లు కూడబెట్టుకున్న విశాఖ డెయిరీ యాజమాన్యం పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తున్నామని బీరాలు పలుకుతోందన్నారు. రైతుల దగ్గర నుంచి సేకరించిన పాలకు ధర పెంచవలసింది పోయి, తిరిగి లీటరుకు మూడు రూపాయలు కోత విధించడం ఏమిటని ప్రశ్నించారు. రైతుల వద్ద పాలు లీటరు రూ.42లకు కొనుగోలు చేసి దానిలో వెన్న తదితర పోషకాలు తీసివేసి, అదేపాలను వినియోగదారులకు లీటరు రూ.80కి అమ్ముతూ లాభాలు గడిస్తుందన్నారు. పాడి రైతులను నిర్లక్ష్యం చేస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. వెంటనే రైతుల నుంచి సేకరించే ఆవు పాల ధర లీటరు రూ.60కి పెంచాలని, సబ్సిడీ ద్వారా దాణా, మందులు తదితరాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు కోరిబిల్లి శంకర్రావు, చెల్లూరు నాగరాజు, తాకాశి వెంకటేశ్వరరావు, శ్రీరామదాసు అబ్బులు, మత్సుర్తి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


గవరపాలెంలో భారీగా వర్షం కురుస్తున్న దృశ్యం

రోజంతా ముసురు వాతావరణం

▸ ఉదయం నుంచి ఎండ.. ఆ వెంటనే వాన
▸ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న పట్టణవాసులు
▸ పలుచోట్ల నీరు నిలిచిపోవడంతో వాహనదారుల అవస్థలు



అనకాపల్లి టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాయుగుండం కారణంగా గురువారం ముసురు వాతావరణం నెలకొంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తూనే ఉంది. ఉదయం వాకింగ్‌కు వెళ్లేవారు మొదలు పాఠశాలలు, కళాశాలలు, ఉద్యోగాలకు వెళ్లేవారు తడుసుకుంటూ వెళ్లారు. మార్కెట్‌లో కూరగాయలు అమ్మే చిల్లర వర్తకులు, రైతులు కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నారు. పలు ప్రాంతాల్లోని రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. పట్టణంలోని విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనచోదకులకు అవస్థలు తప్పలేదు. కొద్దిసేపు ఎండ కాయడం, ఆ వెంటనే కారుమబ్బులు కమ్ముకుని వర్షం కురియడం వల్ల అనకాపల్లి పట్టణానికి వివిధ పనులపై వచ్చే గ్రామీణులు ఇబ్బందులు పడ్డారు.

వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు


మాట్లాడుతున్న పంచాయతీ విస్తరణాధికారి ధర్మారావు

పరవాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యులదే కీలకపాత్ర అని పంచాయతీ విస్తరణాధికారి కె.ధర్మారావు అన్నారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. గ్రామాభివృద్ధికి వార్డు మెంబర్లు ఎలా సహాయ సహకారాలు అందించాలో వివరించారు. గ్రామ సభల నిర్వహణ, గ్రామాభివృద్ధికి ప్రణాళికల తయారు, వీధి దీపాల నిర్వహణ, లేఅవుట్ల అప్రూవల్స్‌కు తీసుకోవాల్సిన అంశాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధుల నిర్వహణ, గ్రామపంచాయతీల ఆస్తుల రక్షణ, ఆదాయ వనరులు సమకూర్చుకోవడం తదితర అంశాలపై తెలియజేశారు. ఏవో జీవీ రాంబాబు, శిక్షకులు పాల్గొన్నారు.

రోగులకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు : డీఎంహెచ్‌వో


సబ్బవరం పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో బాలాజీ

సబ్బవరం, అక్టోబరు 17 (ఆంధ్యజ్యోతి) : ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎంఎస్‌వీకే బాలాజీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీలపై వచ్చిన అభియోగాలపై హాజరు పట్టి, ఎఫ్ఆర్ఎస్ రికార్డులను పరిశీలించారు. అలాగే, గొట్టివాడ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. రోగులకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వర్షాకాలంలో ప్రజలు రోగాల బారిన పడకుండా వారికి తగిన సూచనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

'భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామ సభలు'


తానాం గ్రామసభలో మాట్లాడుతున్న జిల్లా సర్వే అధికారిణి మనీషాత్రిపాఠి


సబ్బవరం మండలం గొల్లలపాలెంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్


కశింకోట మండలం కొత్తపల్లిలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం

పరవాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ గ్రామసభలను ప్రభుత్వం నిర్వహిస్తుందని జిల్లా సర్వే అధికారిణి మనీషాత్రిపాఠి తెలిపారు. మండలంలోని తానాంలో గురువారం ఏర్పాటు చేసిన రెవెన్యూ గ్రామ సభలో ఆమె మాట్లాడారు. రెవెన్యూపరమైన సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకువస్తే వాటికి పరిష్కార మార్గం చూపడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. రెవెన్యూపరమైన సందేహాలను నివృత్తి చేశారు. వివిధ సమస్యలపై 34 మంది రైతులు గ్రామసభలో అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, సర్పంచ్ కన్నూరు దేవి, స్థానిక నాయకులు కన్నూరు వెంకటరమణ, రొంగలి గోపాలకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ కె.ఎస్.నాయుడు, ఆర్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విప్పాక అగ్రహారంలో...

సబ్బవరం : గ్రామాల్లో రీ సర్వే అనంతరం నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ బి. చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని విప్పాక అగ్రహారంలో గురువారం ఈ సభలను ప్రారంభించి మాట్లాడారు. విప్పాక అగ్రహారంలో రీ సర్వేకు ముందు 89.34 ఎకరాలు భూమి ఉండగా, రీ సర్వే తరువాత 89.75 ఎకరాలు ఉందన్నారు. రీ సర్వేకు ముందు 16 సర్వే నెంబర్లు ఉండగా, తరువాత 265 ఎల్‌పీఎం నెంబర్లు అయ్యాయని వివరించారు. ప్రభుత్వ భూమి ముందు 13.89 ఎకరాలు ఉండగా, రీ సర్వే తరువాత 13.5 ఎకరాలు ఉన్నట్టు తేలిందని వివరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సదస్సు దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించామన్నారు. మరో ఏడు అర్జీలు వచ్చాయని, వాటి రికార్డు పరిశీలన అనంతరం పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు సీహెచ్.అప్పారావు, గణేష్, సర్పంచ్ మోపాడ అప్పారావు, సర్వేయర్లు ఎల్. అప్పారావు, లోకేష్, దినేష్, వీఆర్వో జగన్నాథం, కార్యదర్శి రమేశ్‌లతో పాటు పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో...

కశింకోట : మండలంలోని కొత్తపల్లిలో రెవెన్యూ గ్రామ సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పది దరఖాస్తులు వచ్చాయని డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. వీటిలో తొమ్మిది భూములకు సబ్ డివిజన్ చేయాలని, ఒకటి మ్యూటేషన్ చేయాలని అందజేశారన్నారు. ప్రజలంతా రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ భాస్కరరావు, ఆర్ఐ రమేష్, మండల సర్వేయర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



వాల్మీకి మహర్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జయంతిని కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ విజ యకృష్ణన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సం దర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీరామ కథను రామాయణ మహాకావ్యంగా రచించిన వాల్మీకి కారణజన్ముడని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ జాహ్నవి, డీఆర్వో దయానిధి, ఎస్‌డీసీ సుబ్బలక్ష్మి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారుకు గాయం



తురువోలు ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్యం చేయించుకుంటున్న ఎమ్మెల్యే బండారు

చీడికాడ, అక్టోబరు 17: మండ లంలోని తురువోలు గ్రామంలో జరుగుతున్న పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొన్న మాడు గుల ఎమ్మెల్యే బండారు సత్యనారా యణమూర్తి.. వీధుల్లో పర్యటిస్తున్న సమయంలో ఒకచోట కాలు జారి కింద పడబోయారు. పక్కనే ఉన్న టీడీపీ నాయకులు అప్రమత్తమై ఆయనను పట్టుకొన్నారు. ఈ సందర్భంగా బండారు కాలి బొటన వేలుకి గాయమైంది. అదే గ్రామంలో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. అనంతరం యథావిధిగా పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చికాకు పెట్టే మెనోపాజ్!

మహిళల్లో రుతుక్రమం నిలిచిపోయే దశలో ఇబ్బందులు

వయసు పెరుగుతున్న కొద్దీ శరీరంలో మార్పులు అనివార్యం. ఆ సమయంలో కొన్నిరకాల ఇబ్బందులు వేధిస్తాయి. ముఖ్యంగా మహిళల్లో మెనోపాజ్ దశలో చిరాకు, కోపం, డిప్రెషన్ తదితర సమస్యలు ఎదురవుతాయి. వాటిపై సరైన అవగాహన ఉంటే సమర్థంగా ఎదుర్కొనే వీలుంటుంది. ఆందోళన చెందితే సమస్యలు అధికమవడమే కాకుండా మరిన్ని అనారోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదముంటుంది.

- అనారోగ్య సమస్యలు వెంటాడే అవకాశం
- అవగాహన లేక అనేకమందిలో ఆందోళన
- నివారణ మార్గాలతో సమస్యలకు చెక్
- యోగా, మెడిటేషన్, ఆహార అలవాట్లలో మార్పులు తప్పనిసరి
- నేడు వరల్డ్ మెనోపాజ్ డే



విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో మెనోపాజ్ దశ అత్యంత కీలకమైనది. ఈ దశలో అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొంటారు. మెనోపాజ్ అంటే మహిళల్లో (పీరియడ్స్) రుతుక్రమం పూర్తిగా ఆగిపోవడం. రుతుక్రమం జరగడానికి, మహిళలకు సంబంధించిన ఇతర లక్షణాలకు ఈస్ట్రోజన్ హార్మోన్ కీలకంగా పనిచేస్తుంది. రుతుక్రమం ఆగిపోయిన తరువాత ఈ హార్మోన్ తగ్గిపోతుంది. దీనివల్ల వివిధ సమస్యలు వేధిస్తాయి. వీటిపై మహిళలకు సంపూర్ణ అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏటా అక్టోబరు 18న వరల్డ్ మెనోపాజ్ డే నిర్వహిస్తున్నారు. ప్రతి మహిళ జీవితంలో మెనోపాజ్ సర్వసాధారణం. అయితే ఈ దశలో ఎదురయ్యే ఇబ్బందులపై అవగాహనలేక సతమతమవుతుంటారు. ఈ దశలో ఎదుర్కొనే సమస్యల్లో హాట్ ఫ్లాష్ అత్యంత కీలకమైనది. ఈ లక్షణంతో బాధపడే మహిళలు ఫ్యాన్ కింద ఉన్నా, ఏసీ రూముల్లో ఉన్నా తీవ్రమైన చెమటతో బాధపడుతుంటారు. ఒళ్లు వేడిగా ఉంటుంది. దీనివల్ల రోజువారీ చేసే పనులపై ఆసక్తి చూపరు. మూడ్‌లో తరచూ మార్పులు వస్తుంటాయి. విపరీతమైన కోపం, యాంగ్జైటీ లక్షణాలుంటాయి. దీనివల్ల కుటుంబ కలహాలు మొదలవుతుంటాయి. కొందరిలో డిప్రెషన్ వేధిస్తుంది. నిద్ర పట్టకపోవడం, ఎముకల సామర్థ్యం తగ్గిపోతుంది. యూరినరీ సంబంధిత సమస్యలు వేధిస్తాయి. అవగాహన లేక వాటిని భరిస్తూనే ఉంటారు. కొన్ని జాగ్రత్తలు తీసు కోవడం, మందులను వేసుకోవడం ద్వారా ఈ సమస్యలకు కొంతవరకు చెక్ చెప్పే అవకాశం ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

నివారించే మార్గాలివే..

మెనోపాజ్ దశలో ఎదురయ్యే సమస్యలను నివారించేందుకు కొన్ని మార్గాలున్నాయి. ఇందుకోసం పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలి. తగ్గిపోయిన ఎముకల సామర్థ్యాన్ని పెంచుకునేందుకు కాల్షియం, విటమిన్ డి టాబ్లెట్లు వేసుకోవాలి. ఒత్తిడి, యాంగ్జైటీ, డిప్రెషన్ నుంచి బయటపడేందుకు యోగా, మెడిటేషన్, వ్యాయామం చేయాలి.మెనోపాజ్ దశలో ఎదురయ్యే ఇబ్బందులు పట్ల అవగాహన ఉన్నప్పుడే ఈ జాగ్రత్తలను పాటించేందుకు అవకాశంఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

అవగాహన లేకఇబ్బందులు

- డాక్టర్ ఐ.వాణి, డిప్యూటీ సూపరింటెండెంట్, గైనకాలజీ, కేజీహెచ్



మెనోపాజ్ దశ పట్ల అవగాహన లేక చాలా మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇందుకోసం కేజీహెచ్‌లో ప్రత్యేకంగా మోనోపాజ్ క్లినిక్ నిర్వహిస్తున్నాం. ప్రతిరోజూ కనీసం 20 మంది మహిళలు వస్తుం టారు. ఆయా లక్షణాలతో బాధపడే వారిలో దాదాపు 80 శాతం మందికి కారణం కూడా తెలియడం లేదు. కొన్ని సమస్యలకు ఆహార అలవాట్లు, యోగా, మెడిటేషన్ ద్వారా చెక్ చెప్పవచ్చు. మెనోపాజ్ దశకు చేరిన వారిలో కొన్నిరకాల కేన్సర్ల ముప్పు పొంచి ఉంటుంది. కాబట్టి క్లినిక్‌కు వచ్చిన మహిళలకు ప్యాప్‌స్మియర్, మామోగ్రఫీ టెస్ట్ నిర్వహించి సర్వైకల్, రొమ్ము కేన్సర్‌ను గుర్తించే ప్రయత్నం చేస్తున్నాం.

హార్మోనల్ థెరపీతో మేలు

- డాక్టర్ టి.రాధ, విశ్రాంత ప్రిన్సిపాల్, ఆంధ్ర మెడికల్ కళాశాల



మెనోపాజ్ దశకు చేరిన మహిళల్లో ఇబ్బందులు వస్తుంటాయి. వీటినుంచి ఉపశమనం పొందేందుకు గతంలో కొన్నాళ్లపాటు హార్మోనల్ థెరపీ కింద ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ వంటి హార్మోన్లను ఇచ్చేవారు. అయితే 2002లో ఒక స్టడీ వచ్చింది. హార్మోన్ థెరపీ వల్ల ఎక్కువ మంది మహిళల్లో గుండె సంబంధిత సమస్యలు పెరగడంతోపాటు స్ట్రోక్ రిస్క్ పెరుగుతోందని తేలింది. కొందరిలో రొమ్ము కేన్సర్ ముప్పు ఉన్నట్టు గుర్తించారు. దీంతో ఈ థెరపీని నిలిపేశారు. ఆయా లక్షణాలతో బాధపడుతూ 60 ఏళ్లలోపు మెనోపాజ్ దశలో ఉన్న వారికి మాత్రమే హార్మోనల్ థెరపీ ఇస్తున్నారు. వైద్యుల సలహాపై ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ ఇస్తే ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందవచ్చు. 1984 నుంచి వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్, ఇంటర్నేషనల్ మెనోపాజ్ సొసైటీ మెనోపాజ్ డే నిర్వహిస్తూ వస్తోంది. ప్రకృతి సిద్ధంగా జరిగే మహిళల్లో సహజ ప్రక్రియ వల్ల ఎదుయ్యే ఇబ్బందులపై అవగాహన కల్పించడమే దీని ధ్యేయం.

నర్సీపట్నంలో 20న జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



చెట్టుపల్లి హైస్కూల్ పీడీ దేవికి పతకాలు అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ పట్నం జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలు ఈ నెల 20వ తేదీన స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రదానం చేసే పతకాలను రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు వితరణ చేశారు. ఈమేరకు పసిడి, రజత, కాంస్య పతకాలను గురువారం చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల ఫిజికల్ డైరెక్టర్ దేవికి ఆయన అందజేశారు. ఇక్కడ నిర్వహించే పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పీడీ తెలిపారు.

పెందుర్తి-అరకు రోడ్డు నాలుగు లేన్లుగా విస్తరణ

పెందుర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి జంక్షన్ నుంచి విజయనగరం జిల్లా కొత్తవలస మీదు బొడ్డవర జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులకు మోక్షం లభించనున్నది. సుమారు 45 కిలోమీటర్ల రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించనున్నారు. దీనికి ఎన్‌హెచ్ 516బీ అని నంబర్ ప్రకటించారు. బొడ్డవర వద్ద ఎన్‌హెచ్ 516ఈని కలిపేలా రహదారిని అభివృద్ధి చేయనున్నారు. భూ సేకరణ, పునరావాసం, నిర్మాణానికి రూ.956.21 కోట్ల విడుదలకు ఆమోదం తెలుపుతూ కేంద్ర రహదారులు, రవాణా శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించింది. పనులకు సంబంధించి గత నెలలో టెండర్లను ఆహ్వానించి కాంట్రాక్టర్‌ను కూడా ఖరారు చేశారు.

పదో తరగతి విద్యార్థి అదృశ్యం



భగవాన్ (ఫైల్ ఫొటో)

రావికమతం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువున్న విద్యార్థి అదృశ్యమైనట్టు గురువారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్‌ఐ రఘువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గర్నికం గ్రామానికి చెందిన కేశంశెట్టి సత్తిబాబు కుమారుడు భగవాన్ (14) పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 16వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది.. బంధువులు, స్నేహితులను వాకబు చేశారు. భగవాన్ ఆచూకీ లభించకపోవడంతో తండ్రి సత్తిబాబు గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలుడు ఇంటి నుంచి బయటకు వెళ్లినప్పుడు నలుపు చారల టీ షర్ట్, హాఫ్ జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు 9440904214, 8106187952, 9963671538 నంబర్లకు ఫోన్ చేసి చెప్పాలని ఎస్‌ఐ కోరారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	149.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

రైతులకు అందుబాటులో ఉండాలి

- వ్యవసాయ అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, హాజరైన వ్యవసాయశాఖ అధికారులు

అనకాపల్లి కలెక్టరేట్ , అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం వ్యవసాయశాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా పొలం బడి, పొలం పిలుస్తోంది, పీఎం కిసాన్, ప్రకృతి వ్యవసాయం తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. రైతులకు కావాల్సిన సమాచారం, సహాయం వెంటనే అందించాలని వ్యవసాయశాఖ అధికారులను ఆమె ఆదేశించారు. రైతుల రిజిస్ట్రేషన్, ఈకేవైసీ శతశాతం పూర్తి చేయాలన్నారు. పొలంబడి, పొలం పిలుస్తోంది కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని, రైతులను భాగస్వాములను చేసి నూతన సాగు పద్ధతులపై అవగాహన పెంచాలన్నారు. వరి పంట మినహా మిగిలిన పంటల లక్ష్యాలు పూర్తి కావడం లేదని, పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఖరీఫ్ పంట సాగు దశలో ఉందని, తదుపరి సాగు చేసే రబీ పంటకు కావాల్సిన ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ప్రచారం కల్పించి ఆయా ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న పాల్గొన్నారు

బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్లలో టి.అర్జాపురం విద్యార్థులు



రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకుఎంపికైన విద్యార్థులు

రావికమతం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.అర్జాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసిన జట్లలో తొమ్మిది మంది చోటు సంపాదించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాల క్రీడా పోటీలు ఈ నెల 15న చోడవరం మండలం గోవాడ ఉన్నత పాఠశాలలో జరిగాయి. అండర్-14, అండర్-17 విభాగాల్లో టి.అర్జాపురం ఉన్నత పాఠశాలకు చెందిన 11 మంది బాల, బాలికలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అండర్-14 జట్టులో టి.అర్జాపురం పాఠశాలకు చెందిన ఎస్.మహంత్, ఆర్.ప్రవీణ్‌కుమార్, జి.లోకేశ్, ఆర్.శృతి, వి.గిరిజ, ఎం,భారతి, ఎ.లక్ష్మీకుమారి వున్నారు. నవంబరులో అన్నమయ్య జిల్లా అంగులూరులో జరిగే రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని పీడీ రమేశ్‌నాయుడు తెలిపారు. అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎం.రిషిత, ఆర్.ప్రసాద్ ఎంపికయ్యారన్నారు. వీరు నవంబరులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

సమాచార బోర్డు నిర్వహణలో నిర్లక్ష్యం

- అధికారులు బదిలీ అయినా మారని పేర్లు



సమాచార బోర్డులో బదిలీ అయిన అధికారుల పేర్లే దర్శనమిస్తున్న దృశ్యం

పరవాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అధికారులు బదిలీ అయి 15 రోజులు కావస్తున్నా మండల పరిషత్ కార్యాలయంలోని సమాచార బోర్డులో మాత్రం పాత అధికారుల పేర్లే దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు ఫోన్ నంబర్లు కూడా మార్చలేదు. కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే వారంతా బోర్డుపై ఉన్న నంబరుకు ఫోన్ చేస్తుండడంతో అటు నుంచి తాము బదిలీపై వెళ్లిపోయినట్టు సమాచారమిస్తున్నారు. దీంతో స్థానికులు కంగుతింటున్నారు. ఎంపీడీవోగా ఎస్‌డీ శ్యామ్‌సుందర్ బాధ్యతలు స్వీకరించి సుమారు 15 రోజులు కావస్తుంది. సమాచారం బోర్డుపై మాత్రం ఆయన పేరు ఎక్కడ రాయలేదు. అలాగే పంచాయతీ విస్తరణ అధికారి కె. ధర్మారావు బాధ్యతలు స్వీకరించి పది రోజులు కావస్తుంది. కానీ సమాచార బోర్డు మీద మాత్రం గతంలో పనిచేసి బదిలీపై వెళ్లిపోయిన కె.రమేశ్‌నాయుడు పేరు దర్శనమిస్తుంది. అలాగే మండల ఇంజనీర్ జి.సత్యరామారావు పదవీవిరమణ చేయడంతో కొత్తగా స్వాతి బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆమె పేరు కూడా బోర్డుపై రాయలేదు. దీంతో వివిధ పనులపై వచ్చేవారంతా పాత అధికారులకు ఫోన్లు చేసి కంగుతినడం తమ వంతు అయింది. మండల పరిషత్ అధికారులు తక్షణమే కలుగజేసుకుని సమాచార బోర్డులో ప్రస్తుత అధికారుల పేర్లను చేర్చాలని స్థానికులు కోరుతున్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌పై అవగాహన పెరగాలి

- న్యూరాలజీ వైద్యుల సదస్సులో కలెక్టర్ హరేంధిర ప్రసాద్



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌పై ప్రజల్లో అవగాహన పెరగాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. గుండె జబ్బులతో సమానంగా బ్రెయిన్ స్ట్రోక్ కేసులు పెరుగుతున్నాయని, కానీ అవగాహన పెరగడం లేదన్నారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ ఆధ్వర్యంలో 31వ జాతీయ సదస్సు నగరంలోని నోవాటెల్‌లో జరుగుతోంది.

రెండో రోజు సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ బ్రెయిన్ స్ట్రోక్ కారణాలు, చేపట్టాల్సిన చర్యలపై డాక్టర్ బుచ్చిరాజు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా స్ట్రోక్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించాలని సూచించారు. సదస్సులో దేశ, విదేశాల నుంచి రెండు వేల మందికిపైగా న్యూరాలజీ వైద్యులు పాల్గొని చర్చించడం గొప్ప విషయమన్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ న్యూరాలజీ (ఐఏఎన్) ప్రెసిడెంట్ డాక్టర్ దేబాశిష్‌చౌదరి మాట్లాడుతూ న్యూరాలజీలో భిన్నమైన సమస్యలున్నాయన్నారు. ఆయా డివిజన్లలో ఉత్తమ పరిశోధనలు చేసిన వారికి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు అందించాలన్నారు. అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ యు.మీనాక్షి సుందరం మాట్లాడుతూ న్యూరాలజీ వైద్యులు పరిశోధనలపైనా దృష్టి సారించాలన్నారు.

సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ జి.బుచ్చిరాజు, సెక్రటరీ డాక్టర్ ఎస్.గోపి, వైద్యులు డాక్టర్ సత్య వరప్రసాద్, డాక్టర్ ఎం మధుసూదన్‌బాబు, డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ సుష్మ, డాక్టర్ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు. రెండో రోజు సదస్సులో మూర్ఛ వ్యాధి, బ్రెయిన్‌స్ట్రోక్, న్యూరో సమస్యలకు అధునాతన వైద్య పద్ధతులు, జెనిటిక్ ఇష్యూస్‌పై చర్చించారు.

ఎన్టీఆర్ వైద్యాలయానికి అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రం వితరణ



వైద్యాలయానికి అందజేసిన అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరికరం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి డబ్ల్యూడీజేఎం కంపెనీ రూ.25 లక్షలు విలువ చేసే అల్ట్రా సౌండ్ స్కానింగ్ మెషీన్ రెండు ఆపరేటర్లను గురువారం వితరణగా అందజేసింది. కంపెనీ హెచ్‌ఆర్ పల్లవి శివన్న వీటిని సీఎస్ఆర్ నిధులతో కొనుగోలు చేసి ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గైనిక్ వైద్యులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు చోద్యం విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం చోద్యం ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్, సెపాక్ తక్రా పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీఈటీ కుందూరు నూకరాజు తెలిపారు. బుధవారం దేవరాపల్లిలో జరిగిన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పి.గీతిక, సెపాక్‌తక్రా పోటీల్లో వై.రేవతి, టి.మనోజ్ సత్తాచాటారని చెప్పారు.

సుజల స్రవంతి పనులు వెంటనే చేపట్టాలి

- ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి



మాట్లాడుతున్న రెడ్డిపల్లి అప్పలరాజు

చోడవరం, అక్టోబరు 17: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులు వెంటనే చేపట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, ఉత్తరాంధ్రలో.. ప్రత్యేకించి అనకాపల్లి జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధి గురించి పాలకులు పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి వనరుల నిర్వహణకు ప్రభుత్వాలు నిధులు కేటాయించకపోవడంతో వేలాది ఎకరాలకు నీరు అందక పంటలు సరిగా పండడం లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి జిల్లాలో సాగునీటి వనరులను అభివృద్ధి చేయడంతోపాటు, రిజర్వాయర్లు, కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టాలని అప్పలరాజు డిమాండ్ చేశారు.

అధిక ధరకు మద్యంపై ఆగ్రహం

... 5వ పేజీ తరువాయి

గొడవకు దిగారు. బుధవారం ఎక్కువ ధరకు విక్రయించడంతో యాజమాన్యంతో వాగ్వాదానికి దిగి షాపును మూయించారు. గురువారం ఉదయం పది గంటలకు నిర్వాహకులు మద్యం షాపు తెరిచారు. రెండో రోజు కూడా ఎక్కువ ధరకు మద్యం అమ్ముతుండడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ షాపును మూసివేయించారు. విషయం తెలుసుకున్న ఎక్సైజ్ సిబ్బంది సివిల్ డ్రెస్‌లో వచ్చి షాపును తెరిపించి వెళ్లిపోయారు. మందుబాబులు మళ్లీ షాపు వద్దకు చేరుకుని మరోసారి మూసివేయించారు.

డబుల్ రిజిస్ట్రేషన్‌తో తిరకాసు

... 5వ పేజీ తరువాయి

చేసి 2007 మే 17న రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని పెట్ల భద్రాచలం, సింగంపల్లి శ్రీరామ్మూర్తి, యల్లపు ఈశ్వరరావు, కొరుకొండ వరహాలరావు చెబుతున్నారు. తమ పేరిట రిజిస్ట్రేషన్ అయిన భూములను సాంబశివరావు, తదితర వ్యక్తులు 2012లో ఏ విధంగా కొనుగోలు చేస్తారని ప్రశ్నించారు. తాము న్యాయపరంగానే పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ భూముల వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీకి ఎలాంటి సంబంధం లేదన్నారు.